ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..



ఖమ్మం రోటరీనగర్‌లోని దివ్యాంగుల వసతి గృహం ఆవరణలో మూడు చక్రాల సైకిళ్లు, మోటారు వాహనాలు నిరుపయోగంగా పడిఉంటున్నాయి. వీటిని గత సార్వత్రిక ఎన్నికలకు ముందు దివ్యాంగులకు పంపిణీ చేసేందుకు తెప్పించిన అధికారులు ఇలా వృథాగా పడేశారు. జిల్లా సంక్షేమాధికారి రాంగోపాల్ రెడ్డి 'ఈనాడు'తో మాట్లాడుతూ.. త్వరలో కావాల్సిన మరమ్మతులు చేపట్టి సైకిళ్లు, వాహనాలను లబ్ధిదారులకు అందజేస్తామన్నారు. – ఈనాడు, ఖమ్మం

ధాన్యం పక్కదారిపై మంత్రి తుమ్మల కన్నెర్ర

ఈనాడు కథనానికి స్పందన

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: కస్టం మిల్లింగ్ ధాన్యం పక్కదారి పట్టడంపై వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కన్నెర్రజేశారు. ఇటీవల 'ఈనాడు' దినపత్రికలో వచ్చిన వరుస కథనాలకు ఆయన స్పందించారు. అధికారుల అలసత్వం, మిల్లర్ల ఇష్టారాజ్యంతో రూ.కోట్ల విలువైన ధాన్యం అక్రమార్కుల చేతికి వెళ్లడంపై అసహనం వ్యక్తం చేశారు. దీనిపై తక్షణమే ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను ఆదేశించారు. అక్రమ ధాన్యం తరలింపుపై సమగ్ర దర్యాప్తు చేపట్టాలని సూచించారు. ఇష్టారాజ్యంగా వ్యవహరించిన మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా నిబంధనలు కట్టుదిట్టంగా పాటించాలన్నారు. అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ప్రభుత్వం పారదర్శక పాలనకు పెద్దపీట వేస్తోందని.. దుర్వినియోగానికి పాల్పడితే శిక్ష తప్పదని పేర్కొన్నారు.

డీఎస్సీ ఫలితాలు విడుదల

భర్తీ చేయనున్న పోస్టుల వివరాలు	ఖమ్మం	భద్రాద్రి
ఎస్‌ఏ	176	129
ఎల్‌పీ	18	10
పీఈటీ	10	1
ఎస్జీటీ	334	268
ఎస్‌ఏ (స్పెషల్ ఎడ్యుకేషన్)	8	8
ఎస్జీటీ (స్పెషల్ ఎడ్యుకేషన్)	29	31

ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే: ప్రభుత్వం డీఎస్సీ ఫలితాలను సోమవారం విడుదల చేసింది. 2024, జులై 18 నుంచి ఆగస్టు 5వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. అంతకు ముందు మార్చిలో నోటిఫికేషన్ విడులైంది. పరీక్ష జరిగిన రెణ్నెల్లలోనే ఫలితాలు విడుదలయ్యాయి. ఉమ్మడి జిల్లాలోని పలువురు అభ్యర్థులు ప్రతిభకనబరిచారు. ధ్రువపత్రాల పరిశీలన తర్వాత ఎంపికైన వారి తుది జాబితా ప్రకటిస్తారు. ఖమ్మం జిల్లాలో 575, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 447 పోస్టులను భర్తీ చేయనున్నారు.

నేటి నుంచి ధ్రువపత్రాల పరిశీలన

అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలనను ఈ నెల 1వ నుంచి 5 వరకు ఖమ్మం నగరం రిక్కాబజారు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాత కొత్తగూడెం ఆనందఖని జిలా పరిషత్ ఉన్నత పాఠశాలలోని జిల్లా విద్యా శిక్షణా కేంద్రంలో నిర్వహించనున్నట్లు డీఈవోలు సోమశేఖరశర్మ, ఎం.వెంకటేశ్వరాచారి ప్రకటించారు. పరిశీలనకు డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ వారు 1:3 నిష్పత్తిలో వెబ్‌సైట్‌లో పొందుపరిచిన అభ్యర్థులు మాత్రమే హాజరు కావాల్సి ఉంటుంది. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలతో నిర్ణీత తేదీల్లో హాజరై పరిశీలన చేయించుకోవాలి. జాబితాను ఇప్పటికే వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు అధికారులు పేర్కొన్నారు.

ప్రత్యేక ఏర్పాట్లు...

అభ్యర్థుల ధ్రువపత్రాల కోసం ప్రత్యేక కేంద్రాల్లో కౌంటర్లు ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయులతో పాటు క్లర్కులు ధ్రువపత్రాలను పరిశీలిస్తారు. అక్టోబరు రెండో తేదీ గాంధీ జయంతి అయినా ధ్రువపత్రాల పరిశీలనకు సెలవు ఉండదు. అర్హులైన అభ్యర్థుల జాబితాను పరిశీలన అనంతరం జాబితాను రాష్ట్ర అధికారులకు పంపుతారు. దీనికి ఎలాంటి ఇంటర్వ్యూ ఉండదు. వెబ్ కౌన్సెలింగ్ ద్వారా పోస్టింగులు ఇస్తారు. అనంతరం ఈ నెల 9న హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా కొత్త ఉపాధ్యాయులు నియామకపత్రాలను అందుకోనున్నారు.

కష్టాల కడలి దాటి.. కొలువు సాధించి



టేకులపల్లి న్యూస్‌టుడే: ఉపాధ్యాయ కొలువు అతని కల. తన ప్రయాణంలో ఎన్నో కష్టాలు అనుభవించారు. జీవిత భాగస్వామి దూరమైనా కలత చెందలేదు. సొంతంగా పరీక్షకు సిద్ధమవుతూనే.. రెక్కల కష్టంతో తనయులను ఉన్నతంగా చదివించారు. తాజా ఫలితాల్లో ఉత్తమ ర్యాంకులతో శభాష్ అనిపించుకున్నారు. బేతంపూడి గ్రామానికి చెందిన సరికొండ నగేష్‌రావు (43) పంచాయతీ గుమాస్తా (మల్టీపర్పస్ వర్కర్)గా 2001 నుంచి పనిచేస్తున్నారు. 1998లో కోయగూడెంకు చెందిన సునీతతో వివాహమైంది. పదో తరగతితో చదువు నిలిపేసి.. తర్వాత అంబేడ్కర్ వర్సిటీ నుంచి దూరవిద్యలో డిగ్రీ పట్టా అందుకున్నారు. బీఈడీ రెగ్యులర్, డిస్టెన్స్‌లో పీజీ చేశారు. టీచర్ కొలువుకు సిద్ధమయ్యారు. గతేడాది అనారోగ్యంతో భార్య కాలం చేశారు. అయినా మనోధైర్యం వీడలేదు. వ్యవసాయం కూడా చేస్తూ కుమార్తెలు నాగరాణిని డిగ్రీ, సింధును పీజీ చదివించారు. తాజా డీఎస్సీ ఫలితాల్లో తెలుగు పండిట్‌లో జిల్లా స్థాయిలో 9వ, ఎస్జీటీ కేటగిరీలో 1వ ర్యాంకు సాధించారు. స్కూల్ అసిస్టెంట్ (తెలుగు)లోనూ జిల్లాస్థాయి 26వ, ఎస్జీటీ కేటగిరీలో 3వ ర్యాంకు పొందడం విశేషం.

ప్రధానోపాధ్యాయుని సస్పెన్షన్

వైరా, న్యూస్‌టుడే: వైరా మండలం పాలడుగు ఉన్నత పాఠశాలలో ఇటీవల బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తించిన హెచ్.ఎం. చావా శ్రీనివాసరావుపై సస్పెన్షన్ వేటు పడింది. వరంగల్ రీజనల్ జేడీ సత్యనారాయణరెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. హెచ్‌ఎం అనుచితంగా ప్రవర్తిస్తున్నారని విద్యార్థినుల తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుతో డీఈవో శర్మ విచారణ చేశారు. పోక్సో, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైనందున.. క్రమశిక్షణ చర్యలు మరికొన్నిరోజులు సస్పెన్షన్ వేటు కొనసాగుతుందని డీఈవో తెలిపారు. పోలీసులు హెచ్.ఎం.ను మధిర కోర్టులో సోమవారం రిమాండ్ చేశారు.

అందిద్దాం.. గౌరవప్రద జీవితం

ఈనాడు డిజిటల్, కొత్తగూడెం

గతాన్ని భవిష్యత్తుతో పెనవేస్తూ.. వర్తమానానికి వారధులుగా నిలిచే సాక్ష్యాలే వయోవృద్ధుల గాథలు. ప్రస్తుత సమాజంలో కుటుంబం, సమాజంతో పాటు ఆరోగ్యపరంగా వారెదుర్కొంటున్న సవాళ్లెన్నో. ఆందోళనకు లోనుకాకుండా ఆలోచిస్తే ఆయా సవాళ్లను అధిగమించేందుకు పలు మార్గాలున్నాయి. ఆయా వివరాలపై 'నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవ' ప్రత్యేక కథనం.


సంరక్షణ, సహాయ వ్యవస్థల బలోపేతానికి 'గౌరవంతో కూడిన వృద్ధాప్యం' అని ఐక్యరాజ్య సమితి ఈ ఏడాది నినదిస్తోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమైన దరిమిలా సీనియర్ సిటిజన్లను ఎన్నో సమస్యలు వేధిస్తున్నాయి. ఒంటరితనం, చుట్టుముట్టే ఆరోగ్య సమస్యలు, వయోభారం శాపాలవుతున్నాయి. ఈ క్రమంలో తల్లిదండ్రుల పట్ల నిర్లక్ష్యం చూపేవారిపై కఠిన చర్యలు తీసుకునేలా కేంద్రం చట్టాన్ని రూపొందించింది. అదే.. 'వయోవృద్ధుల పోషణ, సంరక్షణ చట్టం-2007'. చట్టం నిబంధనలు ఏం చెబుతున్నాయో వారసులు గమనించి.. తమ బాధ్యతలు నెరవేర్చాలని అధికారులు, న్యాయ నిపుణులు సూచిస్తున్నారు.

★ వయోవృద్ధుల ఆరోగ్య ఖర్చులు కాలక్రమేణా పెరుగుతున్నాయి. మధుమేహం, అధిక రక్తపోటు, గుండె సమస్యలు, కీళ్లనొప్పుల చికిత్సలు ఖర్చుతో కూడుకున్నవి. చాలామంది వృద్ధులు పింఛను, పదవీ విరమణ డబ్బులు వంటి స్థిర ఆదాయాన్ని ఇందుకు వెచ్చిస్తున్నారు. ఈ వెసులుబాటు లేనివారు కుటుంబ సభ్యుల గౌరవ మర్యాదలకు నోచుకోవడం లేదు. కానీ, తమ బాధ్యతను విస్మరించిన వారసులపై కఠిన చర్యలు తీసుకునే అధికారం చట్టానికి ఉంది.

★ వృద్ధుల పిల్లలంటే కుమారుడు, కుమార్తె కాదు.. మైనార్టీ తీరిన మనవళ్లు, మనమరాళ్లు కూడా అని చట్టం చెబుతోంది. వయసు మీరిన వారి సంరక్షణ.. వీరి బాధ్యత.

★ బాధ్యతంటే.. ఆహారం, దుస్తులు, నీడ కల్పించడం, సుస్తీ చేస్తే దవాఖానాలో చికిత్స చేయించడం.

★ సవతి తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలపైనే ఉంటుంది.



వయోవృద్ధులు
ఖమ్మం: 1,80,000
భద్రాద్రి.. 1,50,000

వయసు మీద పడిందని.. జీవన భరోసా కల్పించి తమను ఆదుకోవాలని ఖమ్మం కలెక్టరేట్‌కు వచ్చిన వైరా మండలం పాలడుగుకు చెందిన వృద్ధ దంపతులు రామిశెట్టి బాబురావు, శాంతమ్మ

ముందుచూపుతోనే భరోసా


● వృద్ధుల వైద్యానికి భరోసా కల్పించేందుకు సమగ్ర ఆరోగ్య బీమా పాలసీలు తోడ్పడతాయని ఆ రంగం నిపుణులు చెబుతున్నారు. కుటుంబీకులు ముందుచూపుతో వీటిని తీసుకుంటే.. పరీక్షలు, శస్త్రచికిత్సల అనంతరం సేవలు పొందేందుకు కంపెనీలే డబ్బు చెల్లిస్తాయి. గుండెపోటు, క్యాన్సర్ వంటి తీవ్ర సమస్యల వ్యయాలనూ భరిస్తాయి. బీమా వర్తింపులో వెసులుబాట్లు కల్పిస్తూ ఇటీవల భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐఆర్‌డీఏఐ) నిర్ణయాలు వెలువరించింది. వీటివల్ల మెరుగైన బీమా అందుబాటులోకి వస్తోంది.

● కేంద్రం ఆయుష్మాన్ భారత్-పీఎం జన్ ఆరోగ్య యోజన పేరుతో పేద, ధనిక తేడాలేకుండా రూ.5 లక్షల ఉచిత ఆరోగ్య బీమా సౌకర్యాన్ని కల్పిస్తోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో సుమారు 1.50 లక్షల మంది వృద్ధులకు ప్రయోజనం చేకూరనుంది.

● జిల్లా సర్వజన ఆసుపత్రుల్లో పాలియేటివ్ కేర్ కేంద్రాల్లో ఉచిత వైద్య సేవలను సిబ్బంది నిరంతరం అందిస్తున్నారు.



వృద్ధాప్య అనారోగ్య సమస్యలను ఎదుర్కొనేందుకు ఆరోగ్య బీమా ఉత్తమమైనది. కానీ.. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ప్రతి వంద మందిలో కేవలం ఇద్దరు, లేదా ముగ్గురికే ఈ సదుపాయం ఉంది. 'భవిష్యత్తులో ఎదురయ్యే అనారోగ్య సమస్యల్లోంచి సీనియర్ సిటిజన్లను బయట పడేసే బీమా మార్గాలపై అధికారులు అవగాహన కల్పించాలి' అని కొత్తగూడెంకు చెందిన బీమా సలహాదారు **ఎం.సాంబశివరావు** అన్నారు.



'పిల్లల ఆదరణకు నోచుకోని బాధితులు నేరుగా గానీ, పోస్టు ద్వారా ఆర్డీవో అధ్యక్షతన ఏర్పాటైన వృద్ధుల సంక్షేమ కమిటీలకు తెలపొచ్చు. '14567' టోల్ ఫ్రీ నంబరుకు ఫిర్యాదు చేయొచ్చు. జిల్లా కేంద్రాల్లో సంక్షేమశాఖ 'డే కేర్' కేంద్రాలు నిర్వహిస్తోంది. వృద్ధులకు ఉమ్మడి జిల్లాలో 10 వేల గుర్తింపు కార్డులు కూడా మంజూరు చేశాం. **- కె రాంగోపాల్‌రెడ్డి, జిల్లా సంక్షేమాధికారి, ఖమ్మం**

★ ఆర్థిక ఇబ్బందులున్నాయని.. తమ భూ సమస్యను పరిష్కరించాలని సోమవారం కలెక్టరేట్‌కు వచ్చి గోడు వెళ్లబోసుకున్న తల్లాడ మండలం అన్నారిగూడెం గ్రామ వాసి వేముల బుచ్చయ్య..

3 నుంచి శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 3వ తేదీ నుంచి 12వరకు శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఈఓ జగన్మోహన్‌రావు, ధర్మకర్త ఉప్పల శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో సోమవారం వారు మాట్లాడారు. 3న శ్రీవారు చందనాలంకరణ, 4న అమ్మవారు బాలత్రిపురసుందరీదేవి అలంకారం, 5న గాయత్రీదేవి, 6న అన్నపూర్ణాదేవి, 7న శ్రీమహాలక్ష్మీ దేవి, 8న శ్రీలలితా పరమేశ్వరి, 9న శ్రీసరస్వతీదేవి, 10న శ్రీదుర్గాదేవి, 11న శ్రీమహిషాసురమర్ధని, 12న విజయ దశమి రోజు రాజరాజేశ్వరీదేవిగా భక్తులకు దర్శనమీయనున్నట్టు వివరించారు.

జగన్మాత కొలువుదీరనున్న వేళ..





దేవీ నవరాత్రుల సందర్భంగా ఖమ్మం రోటరీనగర్‌లో విక్రయాలకు సిద్ధంగా ఉంచిన అమ్మవారి విగ్రహాల కొనుగోళ్ల సందడి మొదలైంది. మండపాల నిర్వాహకులు సోమవారం పెద్ద సంఖ్యలో వచ్చి విగ్రహాలను వాహనాల్లో మండపాలకు తరలించారు. – ఈనాడు, ఖమ్మం

జిల్లా పరిశ్రమల శాఖ జీఎంగా సీతారాం

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్‌గా టి.సీతారాం నియమితులయ్యారు. ప్రస్తుత జీఎం కె.అజయ్‌కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈయన స్థానంలో సూర్యాపేట నుంచి సీతారాం వచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

డీటీఓ అఫ్రీన్ సెలవు పొడిగింపు

జిల్లా రవాణాశాఖాధికారి అఫ్రీన్ సిద్దిఖీ సెలవును మరోసారి పొడిగించారు. గత జులై నెలలో వ్యక్తిగత కారణాలతో డీటీఓ సెలవు పెట్టారు. దీంతో కార్యాలయ ఎంవీఐ వి.వెంకటరమణకు ఇన్‌ఛార్జిగా బాధ్యతలు అప్పగించారు. అఫ్రీన్ సోమవారం విధుల్లో చేరాల్సి ఉంది. అక్టోబర్ 15 వరకు సెలవును ఉన్నతాధికారులు తాజాగా పొడిగించారు.

సీనియర్ రెసిడెంట్లకు ముఖాముఖీ

ఖమ్మం కమాన్‌బజార్: ఖమ్మం ప్రభుత్వ మెడికల్ కళాశాలలో 104 ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు దరఖాస్తులను ఆహ్వానించారు. వైద్యుల పోస్టులు మినహా ఇతర ఉద్యోగాలకు భారీ స్పందన లభించింది. గత నెల 29 గడువు నాటికి 1,163 దరఖాస్తులు అందాయి. పోస్టుల్లో సీనియర్ రెసిడెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్లు, స్టోర్ కీపర్, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, రేడియోగ్రఫీ టెక్నీషియన్లు, అనస్థీషియా నిపుణులు, దోబీ ప్యాకర్స్, ఎలక్ట్రీషియన్, గ్యాస్ ఆపరేటర్, డ్రైవర్, ఆపరేషన్ థియేటర్ అసిస్టెంట్లు, వార్డు బాయ్స్ ఉన్నాయి. సీనియర్ రెసిడెంట్‌లో 52 పోస్టులకు 7 దరఖాస్తులే అందాయి. వారికి సోమవారం ముఖాముఖీ నిర్వహించి నియామకాలు కల్పించారు. మిగతా పోస్టులను రోస్టర్ ప్రకారం భర్తీ చేస్తామని ప్రిన్సిపల్ డా.రాజేశ్వరరావు తెలిపారు.

నేడు ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం విద్యావిభాగం: 'డీఈఈ సెట్-2024'లో అర్హత సాధించి.. తొలివిడత పరిశీలనకు హాజరు కాలేకపోయిన అభ్యర్థులకు.. ఈ నెల 1న ఖమ్మంలోని డైట్ కళాశాలలో ధ్రువపత్రాల పరిశీలనకు అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యా, శిక్షణ కళాశాల ప్రిన్సిపల్ సామినేని సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రజల ఫిర్యాదులకు సత్వర పరిష్కారం: కలెక్టర్

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: ప్రజావాణిలో ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌డేలో అర్జీలు స్వీకరించి.. పరిష్కారం నిమిత్తం సంబంధిత శాఖల అధికారులకు అప్పగించారు. ధరణిలో భూముల వివరాలు సక్రమంగా నమోదు చేయాలని, పట్టాదారు పాసు పుస్తకాలు ఇప్పించాలని కోరుతూ పలువురు దరఖాస్తులు అందించారు. అదనపు కలెక్టర్లు శ్రీజ, మధుసూదన్ నాయక్, డీఆర్డీఓ సన్యాసయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రజా సమస్యలు వింటున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పాలిచ్చే తల్లులకు ప్రత్యేక గది

కలెక్టరేట్‌లోని వివిధ శాఖల కార్యాలయాల్లో పనిచేసే ఉద్యోగినుల్లో.. పాలిచ్చే తల్లుల కోసం, పీరియడ్స్‌లో ఉన్నవారికి ప్రత్యేక గది ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ప్రత్యేక గదిలో అవసరమైన పరికరాల సమకూర్చుతామన్నారు. క్రెచ్ (పిల్లల సంరక్షణ కేంద్రం)లో పిల్లలకు మధ్యాహ్న భోజనం అందించాలన్నారు. కలెక్టరేట్ వద్ద ఆర్టీసీ బస్టాప్ త్వరలో అందుబాటులోకి వస్తుందన్నారు.

★ ఉద్యోగ విరమణ పొందిన పరిశ్రమల శాఖ జిల్లా జీఎం అజయ్‌కుమార్‌ను కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సత్కరించారు.

రూ.కోటి స్వాహాకు వ్యూహం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే

బ్యాంకును ఏమార్చి రూ.కోటి స్వాహా చేసేందుకు ఓ ఆర్పీ వ్యూహం పన్నింది. 50 మంది మహిళలతో ఐదు సంఘాలు ఏర్పాటు చేయించి బ్యాంకు ఖాతాలు తెరిచింది. మీకు రూ.10 వేలు వస్తాయని, తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని నమ్మబలికింది. తీరా రూ.20 లక్షలు ఖాతాలో పడినట్లు సంక్షిప్త సందేశం రావడంతో అనుమానం వచ్చిన సంఘాల మహిళలు బ్యాంకుకు పరుగు తీశారు. దీంతో మొత్తం బండారం బయట పడింది.

ఎలా చేశారు..?

ఖమ్మం నగరపాలకంలో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో ఓ రిసోర్స్ పర్సన్ తన పరిధిలోని కొన్ని సంఘాల రుణం చెల్లింపు స్టేట్‌మెంట్‌ను బ్యాంకు నుంచి తీసుకుంది. మరో బ్యాంకులో ఖాతాలను ప్రారంభించింది. పీఎం వెన్నెల పథకం కింద ఒక్కో సభ్యురాలికి రూ.2 లక్షలు మంజూరవుతాయని పలువురు మహిళలను నమ్మబలికింది. రూ.10 వేలు ముందుగా వస్తాయని, తిరిగి చెల్లించాల్సిన అవసరం లేదని చెప్పడంతో 50 మంది సభ్యులుగా చేరేందుకు అంగీకరించారు. వారితో ఐదు సంఘాలను ఏర్పాటు చేసిన ఆర్పీ.. సీనియార్టీ పేరు చెప్పి ఒక్కో సంఘానికి రూ.20 లక్షల రుణం మంజూరు చేయించింది. ముందుగా బ్యాంకు రెండు సంఘాల ఖాతాలకు రూ.40 లక్షలు బదిలీ చేసింది. రుణం జమైనట్లు సంఘాల సభ్యుల చరవాణికి సంక్షిప్త సందేశం వచ్చింది. అనుమానించిన సదరు మహిళలు బ్యాంకు మేనేజర్‌ను కలిశారు. ఆయనకు కూడా అనుమానం రావడంతో రుణ ఖాతాలను హోల్డ్‌లో పెట్టారు. అనంతరం వారంతా మెప్మా కార్యాలయానికి వచ్చి ఆర్పీ, అధికారులతో వాగ్వాదానికి దిగారు. అధికారులు జోక్యం చేసుకొని వారికి సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.




మెప్మా కార్యాలయంలో ఆందోళన చేస్తున్న సభ్యులు, వారి బంధువులు

సంక్షిప్త సందేశం రాకపోతే..

బాధిత మహిళల ఫోన్లకు సందేశాలు రాకపోతే భారీగా సొమ్ము పక్కదారి పట్టేది. మొత్తం ఐదు సంఘాలకు రూ.20 లక్షల చొప్పున రూ.కోటి పక్కదారి పట్టేదని బాధితులు చెబుతున్నారు. లీడర్ల ద్వారా నగదు ఉపసంహరించుకొని.. వారికి రూ.10 వేలు అందజేసి.. మిగిలిన సొమ్మును స్వాహా చేసేందుకు ఆర్పీ యత్నించినట్టు తెలుస్తోంది.

ఈ విజయం అద్భుతం గురూ..!

ప్రతి ఒక్కరికీ ఒక కల ఉంటుంది. కానీ, పట్టువదలకుండా శ్రమిస్తేనే అది నెరవేరుతుంది. ఈ ప్రయాణంలో ఎదురయ్యే కష్టాలెన్నో.. అధిగమించాల్సిన అవరోధాలు ఇంకెన్నో. దేనికీ వెరవకుండా, పట్టుదలతో, ప్రేరణతో, ఓపిగ్గా ముందుకు సాగితేనే గమ్యం దరిచేరుతుంది. ఇదే నిరూపించారు.. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు డీఎస్సీ విజేతలు. తాజాగా పోటీ పరీక్ష ఫలితాలు విడుదలయ్యాయి. పలు సబ్జెక్టులు, కేటగిరీల్లో జిల్లా ప్రథమ స్థానాల్లో నిలిచిన పలువురి నేపథ్యాన్ని పరిశీలిస్తే.. విజయం వెనుక దాగిఉన్న కష్టమెంతో తెలుస్తుంది. సాధించిన లక్ష్యం అద్భుతం అనిపిస్తుంది. పలువురు విజేతలను 'హ్యాట్సాఫ్ గురూ..!' అని బంధుమిత్రులు అభినందిస్తున్నారు. - న్యూస్‌టుడే యంత్రాంగం



రెడ్డి మాధురి



భర్త: రెడ్డి శివకృష్ణ
★ కల్లూరు మండలం చిన్నకోరుకొండి
1 (ఎస్జీటీ), (ఖమ్మం జిల్లా)
✧ మాధురి భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట మండలం అచ్యుతాపురం బీపీఎంగా 2018 నుంచి పనిచేస్తున్నారు. 2016 డీఎస్సీలో విజయం దక్కలేదు. అయినా పట్టుదలతో.. కోచింగ్ లేకుండానే అయిదు నెలల పాటు చదివారు. ఎస్జీటీలో ఖమ్మం జిల్లా ప్రథమ ర్యాంకు సాధించారు. ఈమె భర్త శివకృష్ణ కూడా డీఎస్సీ రాసి ఎస్జీటీలో భద్రాద్రి జిల్లా 26వ ర్యాంకర్‌గా నిలవడం విశేషం. ఆయన ప్రస్తుతం దమ్మపేట మండలం మల్కారం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. - అశ్వారావుపేట, న్యూస్‌టుడే

నీలా శ్రీనివాసరావు



నరసింహారావు, రాములమ్మ
★ సత్తుపల్లి మండలం రామనగరం
1 (స్కూల్ అసిస్టెంట్, సోషల్) (ఖమ్మం జిల్లా)
✧ నిరుపేద కుటుంబం. ఓయులో ఎంఏ, సత్తుపల్లిలో బీఈడీని పూర్తి చేశారు. 2018 డీఎస్సీలో 0.4లో ఉద్యోగం చేజారింది. ఈసారి పట్టుదలతో చదివి జిల్లా స్థాయి ప్రథమ స్థానంలో నిలిచారు. - సత్తుపల్లి, న్యూస్‌టుడే

శీలం తిరుపతిరెడ్డి




వెంకట్రామిరెడ్డి, పద్మావతి ★ తల్లాడ
ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ విభాగంలో జిల్లా స్థాయి 1వ ర్యాంకు, స్కూల్ అసిస్టెంట్ వ్యాయామ విద్య విభాగంలో 3వ ర్యాంకు (ఖమ్మం జిల్లా).
✧ నాలుగు పీజీలు పూర్తి చేశారు. 2015లో పంచాయతీ కార్యదర్శిగా ఉద్యోగం సాధించారు. ప్రస్తుతం కామేపల్లి మండలం గోవింద్రాలలో పనిచేస్తున్నారు. - తల్లాడ, న్యూస్‌టుడే

పేరు: మిద్దే హరికిరణ్



తల్లిదండ్రులు: తల్లి చెన్నమ్మ గృహిణి.
★ గ్రామం: దమ్మపేట మండలం మొద్దులగూడెం
ర్యాంకు:1, ఎస్ఏ ఫిజికల్ జైన్స్, హైదరాబాద్ జిల్లా
✧ ప్రత్యేకత: హరికిరణ్ దమ్మపేట మండలంలో ప్రభుత్వ వాలంటీర్‌గా పనిచేశారు. 2019 నుంచి కొడంగల్‌లో ఎస్సైగా పనిచేస్తున్నారు. - దమ్మపేట, న్యూస్‌టుడే

పావురాల వినోద్‌కృష్ణ



★ భద్రాచలంలోని ఎంపీ కాలనీ
2 (ఎస్ఏ సోషల్) (భద్రాద్రి జిల్లా)
✧ ఎంఏ ఎకనామిక్స్, బీఈడీ చదివిన వినోదకృష్ణ పదేళ్ల కిందట డీఎస్సీ రాసినా ర్యాంకు రాలేదు. ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా చేస్తూనే ఈసారి ప్రిపేర్ అయ్యారు. 'కల నెరవేరింది. కొంత ఆలస్యమైనా పట్టుదల ఉంటే అనుకున్నది సాధించి తీరుతాం' అని నమ్ముతాను. - భద్రాచలం, న్యూస్‌టుడే

ఈలప్రోలు సునీత



సావిత్రి, కృష్ణ
★ చింతకాని మండలం ప్రొద్దుటూరు
3వ (ఎస్జీటీ, ప్రత్యేక విభాగం)(ఖమ్మం జిల్లా)
✧ నిరుపేద కుటుంబానికి చెందిన సునీత తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. విద్యాభ్యాసం అంతా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లోనే కొనసాగింది. భర్త వీరబాబు, తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే మూడో ర్యాంకు సాధించినట్లు సునీత తెలిపింది. - చింతకాని, న్యూస్‌టుడే

కురివీటి రవిబాబు



★ ములకలపల్లి మండలం నర్సాపురం
1, (ఎస్ఏ, ఆంగ్లం) (భద్రాద్రి జిల్లా)
✧ ఎంఏ బీఈడీ పూర్తిచేసిన రవిబాబు అశ్వారావుపేట బీసీ బాలుర గురుకులంలో పీజీటీ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా ఈ ఏడాది జూన్‌లో కొలువులో చేరారు. పట్టుదలతో చదివి తాజాగా డీఎస్సీలో విజయం సాధించారు. తొలి ప్రయత్నంలో 2018లో ఫలితం దక్కలేదు. - అశ్వారావుపేట, న్యూస్‌టుడే

భూక్యా సాయిరాం



భూక్యా చందా, జ్యోతి
★ జూలూరుపాడు మండలం పాపకొల్లు
2, (హిందీ పండిట్), (భద్రాద్రి జిల్లా)
✧ సాయిరాం బీఏ బీఈడీ పూర్తి చేశాడు. వీరిది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు తమకున్న కొద్దిపాటి భూమిలో వ్యవసాయం చేస్తూ కుమారుడిని చదివించారు. డీఎస్సీలో ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. - జూలూరుపాడు, న్యూస్‌టుడే

గోకినేపల్లి పవిత్ర



వెంకన్న- ఉపేంద్రమ్మ
★ తిరుమలాయపాలెం మండలం తెట్టెలపాడు
14 (ఎస్జీటీ), (ఖమ్మం జిల్లా)
✧ నిరుపేద కుటుంబం. తల్లి వ్యవసాయ కూలీ. తండ్రి దుస్తులు ఉతుకుతూ, ఇస్త్రీపని చేసుకుంటూ కుటుంబాన్ని పోషించారు. ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువుకుంది. - తిరుమలాయపాలెం, న్యూస్‌టుడే

వలసాల ఉమ



భర్త: వెంకటేశ్వరరావు (ఉపాధ్యాయుడు)
★ కల్లూరు
2వ (ఎస్జీటీ), (ఖమ్మం జిల్లా)
✧ భర్తే శిక్షకునిగా మారారు. అతని ప్రోత్సాహం, మార్గదర్శకంలో ఇంట్లోనే సిద్ధమయ్యారు. ఇద్దరు పిల్లల బాధ్యతలు నిర్వర్తిస్తూనే ర్యాంకు సాధించారు. - కల్లూరు, న్యూస్‌టుడే

సోందె ఆంజనేయులు



రాంబాబు, కనకమ్మ
★ దుమ్ముగూడెం మండలం మహాదేవపురం
2, (ఎస్జీటీ), (భద్రాద్రి జిల్లా)
✧ 2015-17లో భద్రాచలం బీఈడీ కళాశాలలో డీఎడ్ చేసిన ఆంజనేయులు డిస్టెన్స్‌లో బీఏ చదివారు. వర్సావారిగుంపులో రెండేళ్లు విద్యా వాలంటీరుగా పని చేశారు. వీరిది వ్యవసాయ కుటుంబం. - దుమ్ముగూడెం, న్యూస్‌టుడే

యనరాతి సూరయ్య



వెంకటేశ్వర్లు, సూరమ్మ
★ బోనకల్లు మండలం తూటికుంట్ల
3వ (ఎస్.ఎ. ప్రత్యేక విద్య), (ఖమ్మం జిల్లా)
✧ దళిత పేద కుటుంబంలో జన్మించారు. పెళ్లై ఇద్దరు పిల్లలున్నారు. 15ఏళ్లుగా ఐఈఆర్టీగా పనిచేస్తున్నారు. తండ్రి క్యాన్సర్‌లో పోరాడుతున్నారు. ఉద్యోగం సాధించాలన్న కసితో కోచింగ్ తీసుకోకుండా స్వయంగా మెటీరియల్ రూపొందించుకున్నారు. - బోనకల్లు, న్యూస్‌టుడే

చిల్లపల్లి రాధాకృష్ణ



నరసింహులు, వెంకమ్మ.
★ వేంసూరు మండలం కందుకూరు
7వ (ఎస్జీటీ)(ఖమ్మం జిల్లా)
✧ సామాన్య రైతు కుటుంబం. అన్న గీతకార్మికుడు. ఇంటర్ తరువాత టీటీసీ పూర్తి చేశారు. జిల్లాలో బీసీ-బిలో మొదటి ర్యాంకు దక్కించుకున్నారు. - వేంసూరు, న్యూస్‌టుడే

మండవ ప్రియాంక



భర్త: సతీశ్ (కానిస్టేబుల్)
★ వల్లభి
11 (ఎస్జీటీ) (ఖమ్మం జిల్లా)
✧ ఎలాంటి కోచింగ్ తీసుకోకుండా ఇంటి వద్ద ఉంటూ డీఎస్సీకి సిద్ధమైంది. వివాహమైన తర్వాతే బీఈడీ పూర్తి చేశారు. ఇంటి పనులు చేస్తూ ఖాళీ సమయాల్లో చదివినట్లు తెలిపారు. - ముదిగొండ, న్యూస్‌టుడే

రొయ్యల గణేశ్



సత్యనారాయణ, కళావతి
★ అశ్వారావుపేట మండలం వినాయకపురం
3 (ఎస్జీటీ) (భద్రాద్రి జిల్లా)
✧ గణేశ్‌ది వ్యవసాయ కుటుంబం. తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని చూసి ప్రభుత్వ కొలువు సాధిస్తేనే తమ కష్టాలు తొలుగుతాయని ఆయన భావించారు. పట్టువదలని విక్రమార్కుడిలా డీఎస్సీకి సన్నద్ధమై.. తొలి ప్రయత్నంలోనే ఉపాధ్యాయ వృత్తికి ఎంపికయ్యారు. - అశ్వారావుపేట గ్రామీణం, న్యూస్‌టుడే

ఏనిక రవీందర్



★ ఎలకలగూడెం (అశ్వాపురం)
8 (ఎస్జీటీ, ఎస్టీ కేటగిరీ) (భద్రాద్రి జిల్లా)
✧ తండ్రి లేని రవీందర్‌ది ఓ సాధారణ కుటుంబం. విద్యంతా ప్రభుత్వ, ఆశ్రమ పాఠశాలల్లో సాగింది. ఆపై ఇంటర్, టీటీసీ చదివి, ఉపాధ్యాయ కొలువే లక్ష్యంగా కష్టపడి విజయం సాధించారు. - అశ్వాపురం, న్యూస్‌టుడే

సేవా హృదయం.. దివ్యాంగుడికి ఊతం

స్పందనకు వందనం

తల్లాడ, న్యూస్‌టుడే: ఖమ్మం జిల్లా తల్లాడ మండలం కలకొడిమకు చెందిన ఆదూరి యేసు మేకలను కాస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆయన భార్య మార్తమ్మ మానసిక దివ్యాంగురాలు. వీరి పెద్ద కుమారుడు రమణయ్య పుట్టుకతోనే దివ్యాంగుడు. రెండో కుమారుడు జీవన్ పుట్టుకతోనే పోలియో బారిన పడ్డారు. కుటుంబ దయనీయ పరిస్థితిపై గత నెల 22న 'ఈనాడు'లో 'కన్నీటి కష్టాలు తీర్చండి సారూ..' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన హైదరాబాద్‌కు చెందిన 'సేవా హృదయ్' సంస్థ జీవన్ వినియోగించుకునేందుకు వీలుగా అధునాతన చక్రాల కుర్చీని 'ఈనాడు' ద్వారా పంపించింది. దీన్ని కలకొడిమలో జీవన్‌కు సోమవారం 'ఈనాడు' ప్రతినిధి అందజేశారు. 'సేవా హృదయ్' సంస్థకు, 'ఈనాడు'కు యేసు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.



చక్రాల కుర్చీతో ఆదూరి జీవన్, కుటుంబ సభ్యులు



'ఈనాడు'లో ప్రచురితమైన కథనం

ఆర్నెల్లు.. నాలుగు కొలువులు!

అన్నపురెడ్డిపల్లి, న్యూస్‌టుడే: నేటి పోటీ ప్రపంచంలో ఒక్క ప్రభుత్వ కొలువు సాధించడమే కష్టం. అలాంటిది భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అన్నపురెడ్డిపల్లి మండలం తొట్టిపంపు గ్రామానికి చెందిన బొడ్డుపల్లి పెద్దిరాజు ఆరు నెలల వ్యవధిలోనే నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలను తన ఖాతాలో వేసుకొని, నిరుద్యోగ యువతకు ఆదర్శంగా నిలిశాడు. సోమవారం విడుదలైన డీఎస్సీ (స్కూల్ అసిస్టెంట్ మ్యాథ్స్ విభాగంలో) ఫలితాల్లో మొత్తం 77.77 మార్కులతో జిల్లాలో ప్రథమ ర్యాంకు సాధించి తన సత్తా చాటాడు. పదో తరగతి వరకు అన్నపురెడ్డిపల్లి ఉన్నత పాఠశాలలో చదివిన పెద్దిరాజు ఇంటర్, డిగ్రీ సత్తుపల్లిలో, ఎంఎస్సీ, బీఈడీ ఉస్మానియా విశ్వవిద్యాలయంలో పూర్తిచేశారు.

★ 2024 మార్చిలో విడుదలైన గురుకుల ఉపాధ్యాయ ఫలితాల్లో టీజీటీ, పీజీటీలతోపాటు, జేఎల్‌నూ సాధించారు. ప్రస్తుతం ఆయన సత్తుపల్లి గురుకులంలో జేఎల్‌గా పనిచేస్తున్నారు. డీఎస్సీలో జిల్లా ప్రథమ ర్యాంకుతో ప్రభుత్వ ఉపాధ్యాయ కొలువు సాధించడంతో పెద్దిరాజుకి పలువురు అభినందనలు తెలిపారు.



బొడ్డుపల్లి పెద్దిరాజు

చికెన్ ధరలు



వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -116 రిటైల్ ధర 138 చికెన్ విత్ స్కిన్ - 200, చికెన్ స్కిన్‌లెస్ - 228.

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ధరలు (రూ.లలో)

పంట పేరు	కనిష్ఠ	గరిష్ఠ	నమూనా
కొత్తపత్తి	5,000	7,011	6,900
పాతపత్తి	5,000	7,600	7,400
పెసలు	4,000	7,300	7,300
కందులు	5,200	9,200	9,000
ఏసీ ఎండుమిరప	12,500	20,000	16,500
ఎండుమిరప	12,000	18,500	17,200
ఏసీ తాలుమిరప	9,500	9,600	9,600

కదం తొక్కిన యువ కళాకారులు

ఖమ్మం సారథినగర్, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి యువజనోత్సవాలు సోమవారం ఖమ్మం భక్తరామదాసు కళాక్షేత్రంలో ఉత్సాహంగా జరిగాయి. జనవరి 12న జరిగే జాతీయ యువజనోత్సవాల్లో పాల్గొనేవారిని ఎంపిక చేసేందుకు జిల్లా, రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహిస్తున్నారు. జిల్లా వివిధ ప్రాంతాల నుంచి 860 మంది రంగంలోకి దిగారు. ఉదయం నుంచి రాత్రి 7 వరకు యువ నృత్యాలు, గానాలతో వేదిక దద్దరిల్లింది. తొలుత కార్యక్రమాన్ని డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి, విద్యాశాఖాధికారి సోమశేఖరశర్మ ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడాశాఖ కళాకారులకు భోజనాలతో పాటు ఇతర సదుపాయాలు కల్పించింది. జానపదం, బృందగానంలో టీజీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ ఖమ్మం ప్రథమ, జానపదం నృత్యంలో దివ్య టీజీఆర్‌జేసీ వైరా ప్రథమ, బృంద నృత్యంలో హార్వెస్ట్ జూనియర్ కళాశాల ఖమ్మం ప్రథమ, జానపద గేయాలు సోలోలో వై.మధు ప్రథమ, ఎలక్యూషన్ పోటీలో టి.లక్ష్మీప్రసన్న ప్రథమ, పోస్టర్ డిజైనింగ్‌లో కె.త్రివేణి ప్రథమ, సైన్స్ మేళా విభాగంలో మొత్తం మూడు స్థానాలను ఎస్‌బీఐటీ విద్యార్థుల బృందాలు గెలుచుకున్నాయి. క్రాఫ్ట్ పోటీలో శ్రీన్య ప్రథమ స్థానంలో నిలిచారు. విజేతలకు బహుమతులు డీవైఎస్ఓ అందజేశారు. విజేతలంతా రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరపున పాల్గొంటారని ప్రకటించారు.





ఆకట్టుకున్న కళాకారిణుల జానపద నృత్య ప్రదర్శనలు.. ఉత్సవాలకు తరలివచ్చిన యువత

గెలుపు ఓటములను సమానంగా స్వీకరించాలి: సీసీఎఫ్

కొత్తగూడెం గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ డి.బీమానాయక్ అన్నారు. కొత్తగూడెంలో ఏర్పాటు చేసిన భద్రాద్రి జోనల్ స్థాయి ఫారెస్ట్ స్పోర్ట్స్ మీట్-24 సోమవారం రాత్రితో ముగిశాయి. ఉదయం జోనల్‌లోని వరంగల్, హనుమకొండ, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన క్రీడాకారులకు వాలీబాల్, కబడ్డీ, చెస్, షటిల్, క్రికెట్ తదితర క్రీడలను నిర్వహించారు. ఓవరాల్ ఛాంపియన్‌గా ఖమ్మం జిల్లా జట్టు నిలిచింది. ముఖ్య అతిథిగా హాజరైన సీసీఎఫ్ గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. ముగింపు వేడుకల్లో డీఎఫ్‌వోలు కిష్టాగౌడ్, సిద్దార్థ విక్రమ్‌సింగ్, బత్తుల విశాల్, బి.లావణ్య, అంజు అగర్వాల్, డీసీఎఫ్‌లు కృష్ణమాచార్య, దామోదర్‌రెడ్డి, ఏసీఎఫ్‌లు సుజాత, సయ్యద్ మక్సుద్ మొహియుద్దీన్, బాబు, చంద్రశేఖర్, మంజుల, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ క్రీడలో తలపడుతున్న మహబూబాబాద్-పాల్వంచ జట్లు



కబడ్డీలో కొత్తగూడెం-భద్రాచలం క్రీడాకారుల నువ్వానేనా..

వేర్వేరు ఘటనల్లో.. 180 కిలోల గంజాయి పట్టివేత

భద్రాచలం పట్టణం, న్యూస్‌టుడే: భద్రాచలంలో ఆబ్కారీశాఖ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు రూ.37 లక్షల గంజాయిని సోమవారం పట్టుకున్నారు. ఏఈఎస్ తిరుపతి తెలిపిన వివరాల ప్రకారం.. ముందస్తు సమాచారంతో పట్టణ శివారులో ఎన్‌ఫోర్సుమెంట్ సిబ్బంది నిఘా వేసి.. గంజాయి తరలించే కారును ఆపారు. డ్రైవర్ కారును ఆపకుండా దూసుకెళ్లి పరారయ్యాడు. మార్కెట్ వద్ద కారును గుర్తించిన అధికారులు పట్టణంలో గాలింపు చేపట్టి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. అతడు జహీరాబాద్‌కు చెందిన మహ్మద్ ఫరీద్‌గా గుర్తించారు. ఒడిశా నుంచి ముంబాయికు 130 కిలోల గంజాయిని తరలిస్తున్నట్లు అతడు అంగీకరించాడు. సరకు కొనుగోలు చేయనున్న ముంబయికి చెందిన యూసఫ్ సహీద్‌ఖాన్‌పైనా కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీనివాస్ వెల్లడించారు.

మరో ఘటనలో.. కూనవరం రోడ్డులో తనిఖీలు చేపట్టిన సమయంలో పోలీసులు ఓ ఆటోలో 50 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. నిందితులు ఆటో వదిలి పరారైనట్లు ఎస్సై పీవీఎన్.రావు తెలిపారు.


624 కిలోల సరకు దహనం..

ఖానాపురం హవేలి: కమిషనరేట్ పరిధిలో పలు ఠాణాల్లో పట్టుబడిన 624 కిలోల గంజాయిని సీపీ సునీల్‌దత్ నేతృత్వంలో సోమవారం శాస్త్రీయ పద్ధతిలో పోలీసులు దహనం చేశారు. అడిషనల్ డీసీపీ నరేశ్‌కుమార్ పర్యవేక్షణలో మంచుకొండ అటవీ ప్రాంతంలోని పోలీసు ఫైరింగ్ రేంజ్ వద్ద నిర్వీర్యం చేశారు.

యాసంగి విత్తనాలు సిద్ధం

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే

'యాసంగి' సీజన్‌కు సంబంధించి తెలంగాణ రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ(టీఎస్ సీడ్స్) విత్తనాలను సిద్ధం చేసింది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని రైతులకు వీటిని అందుబాటులో ఉంచింది. అవసరమైన రైతులు వీటిని కొనుగోలు చేసుకోవచ్చని సీడ్స్ ఉమ్మడి జిల్లా మేనేజర్ భిక్షం తెలిపారు. విత్తనాలను ఖమ్మం జిల్లాలోని 76, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 20 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో సిద్ధంగా ఉంచుతామని చెప్పారు. కొద్దిరోజుల్లో మినుములు అందుబాటులో ఉంటాయన్నారు. పెసలు, వరి విత్తనాలకు మరికొంత సమయం పడుతుందని తెలిపారు.



ఖమ్మంలోని విత్తన నాణ్యత ప్రయోగ శాల

నిల్వలు (క్వింటాళ్లలో) విత్తన ధర (కిలో రూ.)

మినుములు
- పీయూ-31 132.80
- టీబీజీ-104 51.04
- జీబీజీ-1 13.36
- రూ.129.56

సెనగలు
- జేజీ-11 0.25
- జేఏకేఎల్-9218 0.25
- ఎన్‌బీఈజీ-49 0.25
- ★ రూ.90

కందులు
- ఐసీపీఎల్-87119 0.20
- 149.75

పెసలు
- ★ రూ.119.73
- ఎంజీజీ-295 39.32
- ఎంజీజీ-385 23.52

నువ్వులు
- జేసీఎస్-1020.. 0.10

వరి

బీపీటీ-5204	32.00	41.32
ఎంటీయూ-1061	2,807	39.50
కేఎన్‌ఎం-1638	85.75	40.20
ఎంటీయూ-1010	66.50	39.80
యూఎంఏ	149.00	--
ఆర్ఎన్ఆర్-15048	17.50	43.76

వేరుసెనగ
- గిరినార్-5: 79.80, 101.55
- కే-6: 0.60, 101.55
- లేపాక్షి: 0.50, 96.55

రైతేరాజు

వరిలో చీడపీడల నియంత్రణ చర్యలు

కొత్తగూడెం వ్యవసాయం, న్యూస్‌టుడే

ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో వరి ముఖ్యమైనది. ఖరీఫ్‌లో అత్యధిక విస్తీర్ణంలో ఈ పంట సాగైంది. ప్రస్తుతం పైరు పొట్ట, ఈనే దశలో ఉంది. ప్రస్తుత వాతావరణంలో ప్రధానంగా చీడపీడల బెడద ఉంది. వీటి నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలను కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త శ్రీనివాస్ వివరించారు.

- ఎండు తెగులు నివారణకు ఎకరాకు 50 గ్రాముల అగ్రోమైసిన్, 200 ఎం.ఎల్. ప్రాపికోనజోల్ పిచికారి చేయాలి.
- పైరును కాండం తొలుచు పురుగు ఆశిస్తే.. నివారణకు కార్టాప్‌హైడ్రో క్లోరైడ్ 400 గ్రాములు లేదా కొరాజిన్ 60 ఎం.ఎల్.ను 100 లీటర్లలో కలిపి ఎకరాకు స్ప్రే చేయాలి.
- అక్కడక్కడా పొలాల్లో పొటాష్ లోపం కనిపిస్తోంది. దీని నివారణకు 30 కిలోల యూరియా, 25 కిలోల పొటాష్‌లో కలిపి ఒక ఎకరాకు చల్లాలి. రైతులు సూచనలను పాటిస్తూ మందులను తగిన మోతాదులో మాత్రమే పిచికారీ చేయాలని, లేదంటే కొత్త చీడలతో ఇతర నష్టం సంభవించే అవకాశం ఉందని శాస్త్రవేత్త హెచ్చరించారు.



ప్రశ్న జవాబు

? ప్రస్తుతం దుబ్బు చేసే దశలో వరి పైరు ఆకుల చివరి భాగం నుంచి ఎండుతోంది. నివారణ తెలపగలరు.
కె.రామకోటారెడ్డి, మీనవోలు

◆ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు వరిలో బ్యాక్టీరియా ఎండుతెగులు వ్యాప్తికి కారణం. నత్రజని ఎరువును తాత్కాలికంగా వేయటం ఆపివేయాలి. పొలం నుంచి నీటిని తీసివేయాలి. ప్లాంటోమైసిన్ 0.2 గ్రాములు, కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారి చేయాలి.

? పత్తిలో మొక్కలు అక్కడక్కడా వాడిపోయి ఎండిపోతున్నాయి.
ఎ.నాగేశ్వరరావు, తొండలగోపవరం

◆ పైపాటుగా 30045ఎట్‌డిరేట్ ఆఫ్ 10 గ్రాములు నీటిలో కలిపి రెండు, మూడు రోజుల వ్యవధిలో పిచికారి చేయాలి. మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి కలిపి మొక్కల మొదళ్ల చుట్టూ నేల తడిచేలా పోయాలి.

? మినుము సాగు చేసి 15 రోజులైంది. ఆకులపై రంధ్రాలు పడుతున్నాయి.
టి.స్వామి, తొండలగోపవరం

◆ చిత్త పురుగులు ఆశిస్తే ఆకులపై రంధ్రాలు పడతాయి. ఎసిఫేట్ 1.5 గ్రాములు లీటరు నీరు లేదా క్లోరోఫైరిపాస్ 2.5 మి.గ్రాముల లీటరు నీటితో కలిపి పిచికారి చేయాలి.

- మధిర, న్యూస్‌టుడే

డాక్టర్ కె.రుక్మిణీదేవి, శాస్త్రవేత్త
మధిర పరిశోధన స్థానం

సమస్యలు పంపాల్సిన వాట్సప్ నెంబరు:
76750 50041

అరటి సాగు.. లాభాలు బాగు



అరటితోటలో రైతు పులిచెర్ల సుబ్బారావు

మధిర, న్యూస్‌టుడే: మధిరకు చెందిన ఓ రైతు దశాబ్దంన్నర కాలంగా అరటి సాగు చేస్తూ మంచి లాభాలు గడిస్తున్నారు. ఏటా మూడెకరాలు కౌలుకు తీసుకొని అరటిలో కర్పూరం, చెక్కరకేళి రకాలు పండిస్తున్నారు. రసాయన ఎరువులను నామమాత్రంగా ఒకదఫా మాత్రమే వాడతారు. పశువుల ఎరువుతోపాటు కోళ్ల ఎరువు, కొన్ని సందర్భాల్లో జీవ రసాయనాలను వినియోగించి అధిక దిగుబడులు సాధిస్తున్నారు. అతడే పులిచెర్ల సుబ్బారావు. అరటి సాగు వివరాలు ఆయన మాటల్లోనే..

'ఎకరా అరటి సాగుకు 900 మొక్కలు నాటాలి. ఒక్కో మొక్కకు రూ.10 ఖర్చు అంటే ఎకరాకు మొక్కలు నాటినందుకు రూ.9వేలు అవసరమవుతాయి. దుక్కులు, వ్యవసాయానికి రూ.10వేలు, ఎరువులకు రూ.15వేలు, గెలలకు ఊతంగా పెట్టేందుకు వాసాలు ఒక్కోదానికి రూ.100 చొప్పున రూ.9వేలు ఖర్చవుతుందన్నారు. పొలం కౌలు, ఇతర యాజమాన్య పద్ధతులు, కూలీలకు మరో రూ.27 వేలు వెరసి మొత్తం రూ.80వేలు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది' అని రైతు తెలిపారు.

దిగుబడి ఇలా..: 'ఎకరాకు 9 వేల మొక్కలు నాటితే 9 వేల గెలలు దిగుబడి వస్తుంది. ఒక్కో గెల రూ.200 నుంచి రూ.250 వరకు పలుకుతుంది. ఎటువంటి రసాయనాలు గెలలపై పిచికారి చేయను. పాకానికి వచ్చిన గెలలను దించి ఇంటి వద్ద కావు వేసి పంట పండిస్తాను. వీటిని కొన్ని సొంతంగా విక్రయించగా మరికొన్నింటిని వ్యాపారస్థులకు అమ్ముతాను. మొత్తమ్మీద ఎకరాకు రూ.1.80 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఖర్చులు పోగా ఎకరానికి రూ.లక్ష వరకు మిగులుతుంది. ఎంత కష్టపడినా ప్రకృతి సహకరిస్తే ఈ ఆదాయాన్ని తీసుకోవచ్చు. ఏటా అరటి సాగుతో ఎకరాకు రూ.లక్ష చొప్పున మూడెకరాలకు సుమారు రూ.3 లక్షల ఆదాయాన్ని రాబట్టవచ్చు.

సత్తుపల్లి

•సత్తుపల్లి •మధిర • వైరా

వరద బాధితులకు చేయూత అభినందనీయం: ఎమ్మెల్యే

సత్తుపల్లి, న్యూస్‌టుడే: ఖమ్మం వరద బాధితులకు తేజా ఒకేషనల్, పారా మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో రూ.70 వేలు నగదు, 4 క్వింటాల బియ్యం సమకూర్చారు. ఎమ్మెల్యే మట్టా రాగమయికి కళాశాల యాజమాన్యం సోమవారం వీటిని అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే అభినందించారు. ఏఎంసీ ఛైర్మన్ దోమ ఆనంద్‌బాబు, కూసంపూడి మధు, ప్రవీణ్‌రెడ్డి, వీరారెడ్డి, శ్రీనివాసరావు, కమల్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాగమయికి నగదు అందిస్తున్న యాజమాన్యం

'సెల్ టవర్ నిర్మాణం ఆపాలి'

మధిర, న్యూస్‌టుడే: లడక్‌వీధి చివర అయ్యప్పనగర్ సమీపంలో వైరానది ఒడ్డున నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణ పనులను తక్షణం ఆపివేయాలని కోరుతూ సోమవారం ఆ ప్రాంత వాసులు తహసీల్దార్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. నిర్మాణ పనులపై విచారణ చేపట్టాలని కోరారు. ప్రతులను ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క క్యాంపు కార్యాలయ ఇన్‌ఛార్జికి, కలెక్టర్, మున్సిపల్ కమిషనర్ అందజేశారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. (10 AM TO 1 PM)
సత్తుపల్లి : 93922 39905
మధిర : 98668 05652
వైరా : 76619 46938

స్పందనకు వందనం

గత నెల 30న ఈనాడులో 'మేమున్నాం మీకు తోడుగా'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. పేరువంచ ఎన్టీఆర్ కాలనీలో తూర్పురోడ్డుపై పిచ్చి మొక్కలను ఎంపీవో ఏనుగు సురేష్‌బాబు జేసీబీతో తొలగించి శుభ్రం చేయించారు.
– వేంసూరు, న్యూస్‌టుడే

రక్షణ సిబ్బంది కీలక పాత్ర పోషించాలి

సత్తుపల్లి, న్యూస్‌టుడే: సింగరేణి ఆస్తుల పరిరక్షణలో సెక్యూరిటీ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని కొత్తగూడెం ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక జేవీఆర్ ప్రాజెక్టు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. జేవీఆర్, కిష్టారం ఓసీల్లో ప్రభుత్వ, ప్రైవేటు సెక్యూరిటీ సిబ్బంది నిబద్ధతతో పనిచేయాలని సూచించారు. గని ప్రభావిత ప్రాంతంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు, ఆర్థిక స్థితిగతులు సరిగ్గా లేని కుటుంబాలు విధుల్లో ఉన్నారని, మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ అజముద్దీన్, జూనియర్ ఇన్‌స్పెక్టర్ రాజయ్య, జమేదార్లు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏరియా సీనియర్ సెక్యూరిటీ అధికారి శ్రీనివాసరావు

రుణమాఫీ వర్తించేనా..?

చింతకాని, న్యూస్‌టుడే

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.2 లక్షల రుణమాఫీ మధిర, సత్తుపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా అనేక మంది రైతులకు ఆర్థిక భరోసా ఇవ్వగా.. మరికొందరి రైతుల్లో ఆందోళనలను మిగిల్చింది. ప్రభుత్వం ఇప్పటికే మూడు విడతలుగా సత్తుపల్లి నియోజకవర్గంలో 25,542 మంది రైతులకు, మధిర నియోజకవర్గంలో 30,004 మందికి రూ.351.37 కోట్ల మేర రుణమాఫీ చేసింది. వీరుకాక రెండు నియోజకవర్గాల పరిధిలో సుమారు 31 వేల మందికి మాఫీ అందలేదు. వారంతా ధ్రువీకరణ పత్రాలతో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారు.

మధిర, సత్తుపల్లి నియోజకవర్గాల్లో రుణమాఫీ అయిన రైతులు ఇలా..

	మధిర	సత్తుపల్లి
మొదటి విడత	15,760	16,043
రెండో	8091	4023
మూడో	6153	5476
పెండింగ్	15,675	15,254



నామవరంలో కుటుంబ నిర్ధారణ చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బాధితులెవరు?

- ☆ రేషన్ కార్డులు లేనివారు
- ☆ రూ.2 లక్షల పైబడి వ్యవసాయ రుణం పొందిన రైతు కుటుంబాలు
- ☆ ఆధార్, బ్యాంకు ఖాతాలో వేర్వేరుగా పేర్లు నమోదైనవారు
- ☆ ఒకే ఆధార్ నంబర్ ఇద్దరి పేరుతో ఉన్నవారు.
- ☆ వేర్వేరు గ్రామాల రైతులు ఒకే కుటుంబంగా ఆన్‌లైన్‌లో తప్పుగా నమోదైన వారు.
- ☆ పాసుపుస్తకం ఇవ్వకుండా బ్యాంకు రుణం పొందిన వారు.

తప్పులు ఇలా...

చింతకాని మండలం లచ్చగూడెనికి చెందిన రైతు గురిజాల రామారావుకు బస్వాపురం యూనియన్ బ్యాంకులో ఖాతా నం. 660905030001335తో రూ.1.67 లక్షల వ్యవసాయ రుణం ఉంది. రామారావు కుటుంబీకులకు వేరే ఏ బ్యాంకులో వ్యవసాయ రుణం లేదు. ఇదే మండలం కొదుమూరుకు చెందిన నక్కనబోయిన వలరాజుకు బస్వాపురం యూనియన్ బ్యాంకులో ఖాతా నం. 660905030001353తో రూ.67 వేల వ్యవసాయ రుణం ఉంది. వీరిద్దరూ నిబంధనల ప్రకారం రుణమాఫీకి అర్హులు. ఏ సంబంధం లేకున్నా రుణమాఫీ సమాచార పత్రంలో వీరిది ఒకే కుటుంబంగా నమోదైనట్లు.. ఇద్దరిదీ కలిపి రూ.2.35 లక్షల పైచిలుకు రుణం ఉందని అధికారులు ధ్రువీకరణ పత్రం ఇవ్వటంతో వారు కంగుతిన్నారు.

సాంకేతిక సమస్య అంటున్నారు

ఊకే శకుంతల, యాతాలకుంట(సత్తుపల్లి)



నాకు ఏపీజీవీబీలో రూ.1.71 లక్షల పంట రుణం ఉంది. జాబితాలో నా పేరు లేదు. అధికారులను సంప్రదిస్తే సాంకేతిక సమస్య అని చెప్పారు. త్వరలో వస్తుందని చెబుతున్నా నమ్మే పరిస్థితి లేదు.

రూ.2 లక్షల పైన రుణం ఉందని..

కిలారి లక్ష్మీనర్సయ్య, నాగులవంచ(చింతకాని)



నాకు నాగులవంచ ఏపీజీవీబీలో రూ.1.5 లక్షల పంట రుణం, నా భార్య లక్ష్మీ పేరు మీద రూ.50 వేల పంట రుణం బ్యాంకులో ఉంది. ఇద్దరిదీ వడ్డీతో సహా కలిపి రూ.2.07 లక్షలు ఉంది. రూ.2 లక్షల కంటే ఎక్కువగా రుణం ఉందన్న కారణంతో జాబితాలో నా పేరు చేర్చలేదని అధికారులు చెప్పారు. ఇటీవలే యాప్‌లో కుటుంబ నిర్ధారణ చేయించాం.

వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక యాప్‌లో రైతుల కుటుంబ నిర్ధారణ చేపట్టే పనిలో ఉన్నారు. నిర్ధారణ 70 శాతం పూర్తయింది. రెండు, మూడు రోజుల్లో కార్యక్రమం పూర్తవుతుంది. అర్హులందరికీ మాఫీ వర్తించేలా చూస్తాం. ఆందోళన చెందాల్సిన పనిలేదు.
– స్వర్ణ విజయచందర్, ఏడీఏ

కాలువ కట్టపై గుంతలు పూడ్చారు..



కల్లూరు, న్యూస్‌టుడే: కాల్వకట్టపై ప్రమాదకరంగా గుంతలు పడటంతో గత నెల 30న గ్రీన్‌ఫీల్డ్ వాహనాలను స్థానిక రైతులు అడ్డుకున్న విషయం విదితమే. దీనిపై 'ఈనాడు'లో ప్రచురితమైన కథనానికి స్పందన లభించింది. జలవనరుల శాఖ ఈఈ లక్ష్మీనారాయణ, డీఈ వెంకటేశ్వర్లు సిబ్బందితో కలిసి గ్రీన్‌ఫీల్డ్ అధికారులతో మాట్లాడి బస్వాపురం మేజరు కాలువకట్టపై గుంతలను పూడ్పించారు. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఎన్డీ నాయకుడి సంతాప సభ

కారేపల్లి, న్యూస్‌టుడే: కొమ్ముగూడెంలో ఎన్డీ సీనియర్ నాయకుడు కరపటి పొట్టన్న సంతాప సభ గుగులోతు తేజ్యానాయక్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, ఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోకినపల్లి వెంకటేశ్వరరావు మృతుడి చిత్రపటంపై పూలమాలలు ఉంచి నివాళి అర్పించారు. బుర్ర వెంకన్న, సందీప్, నాగేశ్వరరావు, సత్తిరెడ్డి, కోయిల శ్రీను పాల్గొన్నారు.

ఎండిన చెట్లు.. పడితే ప్రమాదమే



రహదారి పక్కన ఎండిపోయిన చెట్లు ప్రమాదకరంగా ఉన్నాయి. కొణిజర్ల నుంచి పెద్ద మునగాల వెళ్లే రహదారిలో గోపవరం సమీపంలో చెట్లు ఎండిపోయాయి. అవి ఎప్పుడు పడతాయో అర్థంకాని పరిస్థితి. ఈ రహదారిపై అనునిత్యం ఆటోలు, ద్విచక్ర వాహనదారులతోపాటు రైతులు ప్రయాణిస్తుంటారు. ఇటీవల ఎండిన కొమ్మలు పడి ద్విచక్ర వాహనదారులకు గాయాలు కావడం గమనించాల్సిన అంశం.
- కొణిజర్ల, న్యూస్‌టుడే

ఆదమరిస్తే గోతిలో పడ్డట్లే..!



ఇటీవల వరదలకు ఖమ్మం- బోనకల్లు ప్రధాన రహదారిలో నాగులవంచ సమీపంలోని మూల మలుపు వద్ద ఆర్ అండ్‌బీ రోడ్డు పది అడుగుల మేర కోతకు గురైంది. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాల్లో విద్యార్థులు, వ్యాపారులు, రైతులు, కార్మికులు ప్రయాణిస్తుంటారు. రెండు రోజుల క్రితం ద్విచక్ర వాహనం అందులోపడి వత్సవాయికి చెందిన ఇద్దరు తీవ్ర గాయాలపాలయ్యారు. గోతిని పూడ్చి సమస్య పరిష్కరిస్తామని ఆర్అండ్‌బీ ఏఈ లక్ష్మీనారాయణ తెలిపారు. - చింతకాని, న్యూస్‌టుడే

పిల్లలు రాకుంటే.. నేనే తీసుకొస్తా

తాను పనిచేస్తున్న పాఠశాలలో విద్యార్థులందరూ గిరిజనులే. వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నది ఆ ఉపాధ్యాయుడి సంకల్పం. పాఠశాలకు రాని విద్యార్థులను నిత్యం వారి ఇళ్లకు వెళ్లి తన ద్విచక్ర వాహనంపై ఎక్కించుకొని తీసుకువస్తారు. సోమవారం అలా పాఠశాలకు రాని ముగ్గురు విద్యార్థులను గట్టుగూడెం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు మామిళ్లపల్లి నాగేశ్వరరావు పాఠశాలకు తీసుకొస్తుండగా 'న్యూస్‌టుడే' క్లిక్‌మనిపించింది.
పెనుబల్లి, న్యూస్‌టుడే



'క్రీడలతో మానసిక ప్రశాంతత'

సత్తుపల్లి, న్యూస్‌టుడే: క్రీడలు మానసిక ప్రశాంతతకు దోహదపడతాయని గంగారం 15వ ప్రత్యేక పోలీస్ బెటాలియన్ కమాండెంట్ పీజేపీసీ చటర్జీ అన్నారు. ఆ బెటాలియన్‌లోని ట్రైనింగ్ సెంటర్‌లో ఎస్‌సీటీపీఎస్ ఎస్ గేమ్స్, స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. ఆటలతో శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. అసిస్టెంట్ కమాండెంట్ ఎస్డీ రంగారెడ్డి, అధికారులు, కానిస్టేబుల్స్, హోంగార్డులు పాల్గొన్నారు.

ఎఫ్ఎల్ఎన్ పరీక్షలపై సర్వే

ఎర్రుపాలెం, న్యూస్‌టుడే: ఎఫ్ఎల్ఎన్ పరీక్షలపై డైట్ శిక్షణ ఉపాధ్యాయులచే తక్కెళ్లపాడు ప్రాథమికోన్నత పాఠశాల, గోసవీడు ప్రాథమిక పాఠశాలలో సర్వే నిర్వహించారు. పాఠశాలలను సోమవారం డైట్ కళాశాల ప్రిన్సిపల్ సామినేని సత్యనారాయణ పరిశీలించారు. ఎంఈఓ బి.మురళీ మోహన్, అధ్యాపకుడు సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రశస్త యాప్‌పై ఉపాధ్యాయులకు శిక్షణ

ముదిగొండ, న్యూస్‌టుడే: ముదిగొండ ఉన్నత పాఠశాలలో ప్రశస్త యాప్‌పై ఉపాధ్యాయులకు సోమవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సీఎంఓ రాజశేఖర్ మాట్లాడుతూ... ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తమ చరవాణిలో ప్రశస్త యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ఎంఈఓ రమణయ్య, ప్రధానోపాధ్యాయురాలు శాంతి పాల్గొన్నారు.

'ఉపాధ్యాయ వృత్తి ఆదర్శప్రాయం'

చింతకాని, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి ఆదర్శప్రాయమని ఎంఈఓ వీరపునేని శ్రీనివాసరావు తెలిపారు. పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పరిశ రామమోహన్‌రావును ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం పాఠశాలలో నిర్వహించారు. ఆయన్ను శాలువాలు, పూలమాలలతో సత్కరించారు. హెచ్ఎంలు కనపర్తి వెంకటేశ్వర్లు, చిరంజీవినాయుడు, రాజయ్య, మాధవీదేవి, విశ్రాంత ఉపాధ్యాయుడు పరిశ పుల్లయ్య పాల్గొన్నారు.

బాలింత మృతిపై డిప్యూటీ డీఎంహెచ్ఓ విచారణ

సత్తుపల్లి, న్యూస్‌టుడే: భద్రాద్రి జిల్లా దమ్మపేట మండలం నాచారానికి చెందిన తమ్మిశెట్టి శ్రావణి(21) అనే బాలింత మృతిపై సత్తుపల్లి పాత సెంటర్‌లో ప్రైవేటు ఆసుపత్రి ఎదుట ఇటీవల బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేసిన విషయం విదితమే. ఆసుపత్రిని సోమవారం కల్లూరు డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో టి.సీతారామ్ సందర్శించి మృతిపై విచారించారు. బాలింత మృతికి కారణాలు తెలపాలని వైద్యురాలు రమ్యను ప్రశ్నించారు. ఎలా కాన్పు చేశారు? అత్యవసరంగా ఖమ్మంకు ఎందుకు రిఫర్ చేశారని ప్రశ్నించారు. ప్రైవేటు ఆసుపత్రి వైద్యురాలు మాట్లాడుతూ శ్రావణికి యూరిన్ సమస్య ఉందని, హైపర్ టెన్షన్‌తో ప్లేట్‌లెట్స్ తగ్గిపోవటంతో ముందస్తుగా రిఫర్ చేశామని సమాధానమిచ్చారు. గంగారం, లంకాసాగర్ పీహెచ్‌సీ వైద్యులు అవినాశ్, కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు పంపిణీ



మధిర గ్రామీణం: మహాదేవపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఎనిమిదో తరగతి విద్యార్థినులకు ఎన్ఆర్ఐ కాట్రగడ్డ సునీత జ్ఞాపకార్థం తానా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఎంఈఓ వై.ప్రభాకర్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయుడు సాధు సమాదానం, ఏఏపీసీ ఛైర్‌పర్సన్ మరియమ్మ పాల్గొన్నారు.

ఉత్సాహంగా పాఠశాల క్రీడలు

ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే: జిల్లాస్థాయి పాఠశాల క్రీడలు సోమవారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. డీఈఓ సోమశేఖర శర్మ, డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి పోటీలు ప్రారంభించారు. బాలికల ఖోఖోలో మధిర జోన్ ప్రథమ, ఖమ్మం నార్త్ ద్వితీయ, వాలీబాల్‌లో ఖమ్మం నార్త్ ప్రథమ, సత్తుపల్లి ద్వితీయ, సీనియర్ బాలికల కబడ్డీలో ఖమ్మం నార్త్ ప్రథమ, మధిర ద్వితీయ, విజేతలుగా నిలిచాయి. విజేతలకు పాఠశాల క్రీడల కార్యదర్శి నర్సింహమూర్తి బహుమతులు అందజేశారు.

కేసుల నమోదులో తాత్సారం వద్దు

బోనకల్లు, న్యూస్‌టుడే: ఫిర్యాదుల్ని క్షేత్రస్థాయిలో విచారించి కేసులు నమోదు చేయాలని, పక్షపాత రహితంగా దర్యాప్తు చేయాలని ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. సోమవారం బోనకల్లు పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్‌లకు వచ్చే అర్జీల విచారణ కోసం అప్పగించే బాధ్యతలను సెక్టార్ పోలీస్ అధికారులు సీరియస్‌గా తీసుకొని విచారణ చేపట్టాలన్నారు. కేసుల నమోదులో తాత్సారం వద్దన్నారు. సరిహద్దు రాష్ట్రాల నుంచి అక్రమ రవాణాను నియంత్రించేందుకు రాత్రి గస్తీ, పోలీస్ పెట్రోలింగ్ ముమ్మరం చేయాలన్నారు. ఫిర్యాదులు, కేసుల నమోదు దస్త్రాలు పరిశీలించారు.



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

కల్లూరు, న్యూస్‌టుడే: మధ్యాహ్న భోజన పథకాన్ని హరేరామ హరేకృష్ణ ఫౌండేషన్‌కు అప్పగించే ఆలోచనను విరమించుకోవాలని కోరుతూ కార్మికులు సోమవారం జాతీయ రహదారిపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఆర్డీవో కార్యాలయం ఎదుట చేపట్టిన ధర్నాలో మాట్లాడుతూ నాణ్యమైన భోజనం అందిస్తున్న తమ నోటి దగ్గర కూడు తొలగిస్తే రోడ్డున పడతామన్నారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళనలో మధ్యాహ్న భోజన కార్మిక రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నిమ్మటూరు రామకృష్ణ, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, సీపీఐ నాయకుడు దయాకర్, భాస్కర్, యోబు పాల్గొన్నారు.

వేతనాలు చెల్లించాలని ఆందోళన

కొణిజర్ల, న్యూస్‌టుడే: వేతనాలు అందించడం లేదంటూ లాలాపురం సమీపంలోని ఓ బ్రిక్స్ పరిశ్రమ ఎదుట కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. పరిశ్రమ గేటుకు తాళం వేసి నిరసన తెలిపారు. నాలుగు నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవడంతో ఇబ్బందులు పడుతున్నామన్నారు. పీఎఫ్ పేరుతో వేతనాల్లో కోత విధించి అకౌంట్‌లో జమ చేయలేదని ఆరోపించారు. వెంటనే వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యాలయం తనిఖీ

బోనకల్లు, న్యూస్‌టుడే: రాష్ట్ర పంచాయతీరాజ్ జాయింట్ కమిషనర్ ఎంఏ కృష్ణనన్ సోమవారం బోనకల్లు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. గ్రామ పంచాయతీ దస్త్రాలను పరిశీలించారు. పలు శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీలో ఏమేం పరికరాలున్నాయో అడిగి తెలుసుకున్నారు. ఐకేపీ, ఐసీడీఎస్, ఉపాధి పథకం శాఖలతో సమీక్షించారు. జడ్పీ డిప్యూటీ సీఈవో నాగలక్ష్మి, డీఎల్పీవో రాంబాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యశాస్త్రి, మండల వైద్యాధికారి స్రవంతి, సీహెచ్‌వో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



దస్త్రాలు పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ సంయుక్త కమిషనర్ ఎంఏ కృష్ణనన్

సీహెచ్‌సీ ల్యాబ్ టెక్నీషియన్ సస్పెన్షన్

పెనుబల్లి, న్యూస్‌టుడే: పెనుబల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ ప్రతిభను సస్పెండ్ చేస్తూ డీసీహెచ్ఎస్ రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పెనుబల్లి వైద్యశాలను అదనపు కలెక్టర్ శ్రీజ సందర్శించిన సమయంలో రోగుల వద్ద ప్రైవేటు ల్యాబ్‌ల రిపోర్టులున్నాయి. వైద్యశాలకు వచ్చే పేద రోగులను రోగ నిర్ధారణ పరీక్షల కోసం బయటకు పంపటంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అదనపు కలెక్టర్ ఫిర్యాదు మేరకు డీసీహెచ్ఎస్ సస్పెన్షన్ వేటు వేశారు.

8.5 కిలోల గంజాయి స్వాధీనం

కొణిజర్ల, న్యూస్‌టుడే: గుట్టుచప్పుడు కాకుండా తరలిస్తున్న గంజాయిని పల్లిపాడు వద్ద ఆబ్కారీ అధికారులు సోమవారం పట్టుకున్నారు. ఆర్టీసీ బస్సులను నిలిపి సీఐ మమత, ఎస్సై సాయిరాం ఆధ్వర్యంలో సిబ్బంది తనిఖీ చేస్తున్నారు. విషయం గమనించిన ముగ్గురు యువకులు భద్రాచలం నుంచి ఖమ్మం వస్తున్న బస్సు నుంచి దిగి అనుమానాస్పదంగా బయట తిరుగుతున్నారు. ఆబ్కారీ అధికారులు వారిని అదుపులోకి తీసుకుని విచారించి బ్యాగుల్లో నుంచి 8.5 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తరలిస్తున్న చంద్రబాబు, అఫ్రోజ్, అజీబ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నెల్లూరుకు చెందిన బీటెక్ విద్యార్థులుగా గుర్తించామని, వారిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కేసు నమోదు

చింతకాని, న్యూస్‌టుడే: రామకృష్ణాపురానికి చెందిన జంగం గాంధీ, కొప్పుల సైదుల మధ్య సోమవారం వివాదం నెలకొంది. గాంధీ కోపంకతో సైదులు, అతని భార్యపై దాడి చేసి గాయపర్చాడు. అసభ్య పదజాలంతో దూషించాడు. నిందితునిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్ మీరా తెలిపారు.

పని ఉందని చెప్పి..

పెనుబల్లి, న్యూస్‌టుడే: ముత్తగూడేనికి చెందిన శీలం కృష్ణారెడ్డి(38) వీఎం బంజర్‌లోని ఓ పురుగు మందుల దుకాణంలో గుమస్తాగా పని చేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం పని ఉందని యజమానికి చెప్పి బయటకు వెళ్లాడు. టేకులపల్లి-కుప్పెనకుంట్ల రహదారిలోని ఇటుక బట్టీల సమీపంలో వాంతులు చేసుకుంటుండగా కొందరు రైతులు చూసి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు వచ్చి చూడగా ద్విచక్ర వాహనం, శిరస్త్రాణం, సెల్‌ఫోన్, చెప్పులు, గడ్డిమందు డబ్బా కనిపించాయి. అతని కోసం రాత్రి 9 గంటల వరకు పరిసర ప్రాంతాల్లో వెతికినా కనపడలేదు. కృష్ణారెడ్డి ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు అనుమానిస్తున్నారు.

సీపీఎం సానుభూతిపరురాలు మృతి

తల్లాడ, న్యూస్‌టుడే: నూతనకల్ గ్రామానికి చెందిన సీపీఎం సానుభూతిపరురాలు పసుపులేటి లీలావతి(62) గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. పార్టీ నాయకులు సాయిన్ని ప్రకాశరావు, శీలం సత్యనారాయణరెడ్డి, కల్యాణ కృష్ణయ్య నివాళి అర్పించారు.

తిరుమల లడ్డూ కల్తీ దుర్మార్గం: వీహెచ్‌పీ

కల్లూరు, న్యూస్‌టుడే: తిరుతి లడ్డూ కల్తీ ఉదంతం ప్రతి హిందువునూ ఆవేదనకు గురిచేసిందని వీహెచ్‌పీ నాయకులు అన్నారు. సంఘం ఆధ్వర్యంలో సోమవారం కొత్త బస్టాండు నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఆర్డీవో రాజేందర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు. సంఘం మండల అధ్యక్షుడు బొడ్డు కృష్ణ, హిందూ సంఘాల నాయకులు లక్కినేని ప్రసాద్, రఘు, తుమ్మలపూడి పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

వైరా, న్యూస్‌టుడే: లడ్డూ కల్తీపై వైరాలో సోమవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పాతసెంటర్ రామాలయం నుంచి బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. పగిడిపల్లి జగన్‌మోహన్‌రావు, గంధ లక్ష్మి, నరసయ్య, రాఘవరావు, రాజారావు పాల్గొన్నారు.



వైరాలో నిరసన తెలుపుతున్న హిందువులు

దేశంలో నిరుద్యోగ సమస్య

వైరా, న్యూస్‌టుడే: దేశంలో నిరుద్యోగ సమస్య అధికంగా పెరిగిందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు బొంతు రాంబాబు ఆరోపించారు. వైరాలోని సీపీఎం కార్యాలయంలో మందడపు రామారావు అధ్యక్షతన సోమవారం సమావేశంలో మాట్లాడారు. పట్టణ కార్యదర్శి సుంకర సుధాకర్, బొంతు సమత, జమాల్, చలపతిరావు, శ్రీనివాసరావు, ప్రసాద్, నరసింహాచారి, మధు పాల్గొన్నారు.

ఏన్కూరు, న్యూస్‌టుడే: వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఎం గెలుపు కోసం పార్టీ సభ్యులు కృషి చేయాలని పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు భూక్యా వీరభద్రం పిలుపునిచ్చారు. రేపల్లెవాడ గ్రామ మహాసభ షేక్ నవాబ్ అధ్యక్షతన సోమవారం జరిగింది. సభలో భూక్యా వీరభద్రం, బొంతు రాంబాబు, మెరుగు సత్యనారాయణ మాట్లాడారు.

కల సాకారమవుతున్న వేళ..

కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చునని నిరూపించారు గ్రామీణ ప్రాంత యువకులు, మహిళలు. చాలామంది సొంతంగా సన్నద్ధమై విజయం సాధించారు. కొందరు వివాహం అయిన తరువాత భర్తల ప్రోత్సాహంతో అనుకున్న లక్ష్యాన్ని సాధించారు. టీచర్ ఉద్యోగం సాధించాలనే లక్ష్యాన్ని సాకారం చేసుకున్నారు. 2024 డీఎస్సీ ర్యాంకుల్లో ప్రతిభ చూపిన వారిని చూసినట్టయితే..



భర్త ప్రోత్సాహంతో ఐఈఆర్‌పీ ఎస్జీటీలో జిల్లా రెండో ర్యాంకు సాధించారు వేంసూరు మండలం లింగపాలెం గ్రామానికి చెందిన బొట్టు శిరీష. సామాన్య రైతు కుటుంబం ఈమెది. భర్త విజయ్‌కుమార్ సత్తుపల్లిలో కాంట్రాక్టు పద్ధతిలో ఐఈఆర్‌పీగా పనిచేస్తున్నారు. శిరీష ఇంటర్ తరువాత డిప్లొమో కోర్సు చేసి తనూ కాంట్రాక్టు పద్ధతిలో 15 ఏళ్లుగా సత్తుపల్లి మండలంలో పనిచేస్తున్నారు.
- వేంసూరు, న్యూస్‌టుడే



నిరుపేద కుటుంబంలో జన్మించిన ఈలప్రోలు నరేశ్ ఎలాగైనా కొలువు సాధించాలన్న లక్ష్యంతో చిత్తశుద్ధితో శ్రమించారు. ప్రత్యేక విద్య ఎస్జీటీ విభాగంలో 11వ ర్యాంకు సాధించారు. ఇతని తల్లిదండ్రులపేర్లు వెంకటేశ్వర్లు, లక్ష్మి. చింతకాని మండలం ప్రొద్దుటూరు స్వగ్రామం. ప్రభుత్వ విద్యాలయాల్లోనే చదువంతా పూర్తిచేశారు. ప్రైవేటు ఉపాధ్యాయునిగా పనిచేస్తూ కొలువు సాధించారు. - చింతకాని, న్యూస్‌టుడే

తండ్రి ఉపాధ్యాయ కొలువు విరమణ రోజునే..

ఉపాధ్యాయుడైన తండ్రి ఉద్యోగ విరమణ చేసిన రోజున డీఎస్సీ ఫలితాల్లో ఆయన కుమారుడు మెరుగైన ర్యాంకు సాధించారు. చిలుకూరు గ్రామానికి చెందిన రావిరాల లక్ష్మణరావు దెందుకూరు పాఠశాలలో ఉపాధ్యాయునిగా పని చేస్తూ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఆయన కుమారుడు భరత్‌కుమార్ డీఎస్సీ ఎస్జీటీ విభాగంలో 101వ ర్యాంకు సాధించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
- మధిర గ్రామీణం, న్యూస్‌టుడే





ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన అలవాల అనూష ఎస్జీటీలో 80వ ర్యాంకు సాధించారు. ఈమె భర్త రామకృష్ణ సైతం 210 ర్యాంకు దక్కించుకున్నారు. దంపతులిద్దరూ గతంలో ప్రైవేటు ఉపాధ్యాయులుగా పనిచేశారు. కోచింగ్ తీసుకోకుండానే ఇంటివద్దనే ప్రిపేర్ అయ్యారు. వీరికి ఇద్దరు కుమారులు. టీచర్ కొలువు సాధించటమే లక్ష్యంగా ప్రణాళిక ప్రకారం చదివినట్టు అనూష తెలిపారు.
- ముదిగొండ, న్యూస్‌టుడే

ఖమ్మం

• ఖమ్మం • పాలేరు

'సిబ్బందినిచ్చి సహకరిస్తే సర్వే చేస్తాం'

ఖమ్మం వ్యవసాయం, న్యూస్‌టుడే: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన డిజిటల్ క్రాప్ సర్వేకు తాము వ్యతిరేకం కాదని, తగినంత మంది సిబ్బందిని తమకు కేటాయిస్తే చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు జిల్లా వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం స్పష్టం చేసింది. ఈ మేరకు సోమవారం జిల్లా వ్యవసాయశాఖ అధికారి డి.పుల్లయ్యకు వారు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయశాఖలో విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్లను నియమించాలని కోరారు. కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా వివిధ రాష్ట్రాల్లో అనుసరిస్తున్న విధంగా తెలంగాణ రాష్ట్రంలో గ్రామస్థాయిలో గ్రామానికి ఒక శాశ్వత/తాత్కాలిక సర్వేయర్‌ను నియమించిన తర్వాతనే సర్వేను మొదలు పెట్టాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విస్తరణ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్.నాగుల్‌మీరా, జిల్లా బాధ్యులు శ్రీకాంత్, మహేశ్, కుమార్ రాజా, సరిత, జిష్ణు పాల్గొన్నారు.

నేడు టీటీడీసీలో వయోవృద్ధుల దినోత్సవం

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకొని నేడు(మంగళవారం) టీటీడీసీ భవనంలో వేడుకలు నిర్వహించనున్నట్లు డీడబ్ల్యూఓ కె.రాంగోపాల్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమాలు ప్రారంభమవుతాయని ప్రకటించారు. వయోవృద్ధులు విజయవంతం చేయాలని కోరారు.

మేమున్నాం.. మీకు తోడుగా..

ఖమ్మం: 80085 52623, 93944 50199
రఘునాథపాలెం: 8008573674
పాలేరు: 97010 67081



స్పందనకు వందనం

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: 16వ డివిజన్ సీతారాంపురం రోడ్ నెం.5లో వీధి దీపం వెలగడం లేదని స్థానికులు 'మేమున్నాం.. మీకు తోడుగా'కు వివరించారు. సమస్యను ఈఈ కృష్ణలాల్ దృష్టికి తీసుకెళ్లగా ఆయన ఆదేశాల మేరకు వీధి దీపం ఏర్పాటు చేశారు.

'లడ్డూ కల్తీ బాధ్యులను కఠినంగా శిక్షించాలి'



నిరసన ప్రదర్శనలో విశ్వ హిందూ పరిషత్ కార్యకర్తలు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: తిరుమల తిరుపతి దేవస్థానంలో లడ్డూ ప్రసాదం కల్తీ ఘటనకు నిరసనగా విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో నగరంలో సోమవారం ప్రదర్శన నిర్వహించారు. నగర బస్టాండు కూడలి నుంచి పాత కలెక్టరేట్ వరకు వీహెచ్‌పీ కార్యకర్తలు ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన చేపట్టారు. తిరుపతి లడ్డూ వివాదంపై సిట్టింగ్ న్యాయమూర్తితో విచారణ జరిపించాలని, హిందూ దేవాలయాలపై ప్రభుత్వ పెత్తనం వైదొలగాలని డిమాండ్ చేశారు. వీహెచ్‌పీ సభ్యులు మల్లికార్జున్, రామకృష్ణ, శ్రీనివాస్, రవి, రాంబాబు, వేణు, బాలాజీ, కృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

భాజపా ప్రచార వాహనం ప్రారంభం

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: భాజపా సభ్యత్వం స్వీకరించాలని కోరుతూ తిరిగే ప్రచార వాహనాన్ని 7వ డివిజన్ కార్పొరేటర్ దొంగల సత్యనారాయణ రోటరీనగర్‌లో సోమవారం జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాహనం ద్వారా ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని, కార్యక్రమం విజయవంతం చేయాలని నాయకులు కోరారు. ఖమ్మం అర్బన్, టౌన్ అధ్యక్షుడు శ్రీనివాస్, అంజయ్య, అంజన్న, సీతారాములు, సాంబశివరావు పాల్గొన్నారు.



జెండా ఊపి ప్రచార వాహనం ప్రారంభిస్తున్న కార్పొరేటర్ సత్యనారాయణ

రోగం తగ్గాలంటే సొమ్ములు ఉండాల్సిందే!

సర్వజనాసుపత్రిలో ఔషధాల కొరత

పేదలు వైద్యం కోసం సర్కారు దవాఖానాలను ఆశ్రయిస్తారు. ఏదైనా జబ్బు చేసి ఆసుపత్రికి వెళ్తే వైద్యుడు మందులైతే రాస్తున్నారు.. కానీ ఫార్మసీలో లేవు.. బయట కొనుక్కోండి అనే సమాధానం వస్తోంది. పేరుకు పెద్దాసుపత్రి.. కానీ కనీస మందులు లేకపోవడంపై జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన రోగులు పెదవి విరుస్తున్నారు.

- ఖమ్మం వైద్యవిభాగం, న్యూస్‌టుడే



ఓపీలో వేచి చూస్తున్న రోగులు

ఖమ్మం సర్వజనాసుపత్రిని మందుల కొరత వేధిస్తోంది. చికిత్స కోసం వచ్చిన రోగులకు వైద్యులు రాసిన మందులు ఫార్మసీలో లభించడం లేదు. డబ్బులు చెల్లించి బయట దుకాణాల్లో కొనుగోలు చేసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ఆర్థిక స్తోమత లేకనే ప్రభుత్వ ఆసుపత్రికి వస్తే మందులు బయట కొనుక్కోమంటున్నారని రోగులు వాపోతున్నారు. ఉన్నతాధికారుల నిత్య పర్యటనలతో సేవలు మెరుగవుతాయని అనుకుంటే మందులే ఇవ్వడం లేదని ఆరోపిస్తున్నారు.

ఎందుకీ సమస్య..

ఫార్మసీ విభాగంలో గందరగోళమే ఔషధాల కొరతకు కారణమని తెలుస్తోంది. ప్రభుత్వం 500 రకాలకుపైగా మందులు సరఫరా చేయాలి. సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి వాటిని ఆస్పత్రులకు పంపిణీ చేయాలి. ఈ క్రమంలో ఆస్పత్రిలో ఏవి అందుబాటులో ఉన్నాయి? ఏమి లేవనే విషయంలో పర్యవేక్షణ లోపించింది. ఇండెంట్ నుంచి మందులు నిల్వ చేసే వరకు ముందస్తు ప్రణాళికలు లేవు. ప్రభుత్వం నుంచి సరఫరా చేసే ఔషధాలు అన్ని రకాలు రావడం లేదు. దాదాపు 130 రకాల మందులు, సర్జికల్స్ అందుబాటులో లేవు. వైద్యులు రాసినవి అందుబాటులో లేకుంటే ముందే వైద్యులకు తెలియజేయాలి. వారు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ మందులు రాస్తారు. ప్రతి రోజు ఫార్మసీలో ఉన్న మందుల వివరాల జాబితాను వైద్యులకు ఓపీ మొదలయ్యే సమయానికే తెలియజేయడం లేదు. ఓపీ, ఫార్మసీ విభాగాల మధ్య సమన్వయ లోపం స్పష్టంగా కనిపిస్తోంది.

చర్యలు తీసుకుంటాం

ఆస్పత్రిలో ఔషధాల కొరత లేకుండా చర్యలు తీసుకుంటాం. అందుబాటులో లేని మందుల జాబితాను తయారు చేస్తున్నాం. అత్యవసరమైన వాటిని ఇక్కడ కొనుగోలు చేసి రోగులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటాం. ఫార్మసీ విభాగాన్ని బలోపేతం చేసి సమస్య తలెత్తకుండా ఏర్పాట్లు చేస్తాం.

- ఎల్.కిరణ్‌కుమార్, మెడికల్ సూపరింటెండెంట్

సెల్ టవర్ నిర్మాణం ఆపేయాలని వినతి

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: భైరవునిపల్లిలో జనావాసాల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని ఆపేయాలని సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణిలో విన్నవించారు. మండలస్థాయి నాయకులకు వినతులిచ్చినా స్పందించలేదని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌కు విన్నవించారు. 150 మందితో సంతకాలు సేకరించి కలెక్టర్‌కు అందించారు. నాయకులు పెద్దపాక రాందాసు, రామకృష్ణ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

మండలాధ్యక్షుడికి సన్మానం

నేలకొండపల్లి, న్యూస్‌టుడే: భాజపా మండలాధ్యక్షుడిగా ఇటీవల ఎన్నికైన పాగర్తి సుధాకర్‌ను నేలకొండపల్లి మండల రజక సంఘం నేతలు సోమవారం సన్మానించారు. శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ సిబ్బందికి సన్మానం

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: ఖమ్మం పోలీసు కమిషనరేట్ పరిధిలో విధులు నిర్వహిస్తూ ఉద్యోగ విరమణ పొందిన పోలీసు, హోంగార్డు అధికారులను కమిషనరేట్‌లో సీపీ సునీల్‌దత్ శాలువాలు కప్పి, పూలమాలలతో సోమవారం సన్మానించారు. అదనపు డీసీపీ నరేశ్‌కుమార్, అదనపు డీసీపీ లాఅండ్ ఆర్డర్ ప్రసాదరావు, ఆర్ఐ కామరాజు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి ఆదర్శప్రాయం

చింతకాని, న్యూస్‌టుడే: ఉపాధ్యాయ వృత్తి ఆదర్శప్రాయమని ఎంఈఓ వీరపునేని శ్రీనివాసరావు తెలిపారు. పందిళ్లపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎం పరిశ రామమోహన్‌రావును ఉద్యోగ విరమణ కార్యక్రమం సోమవారం పాఠశాలలో నిర్వహించారు. హెచ్ఎంలు కనపర్తి వెంకటేశ్వర్లు, చిరంజీవి నాయుడు, రాజయ్య, మాధవీదేవి పాల్గొన్నారు.



రామమోహన్‌రావును సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఉత్సాహంగా పాఠశాల క్రీడలు



జిల్లాస్థాయి పాఠశాల క్రీడలు సోమవారం ఖమ్మం పటేల్ స్టేడియంలో ఉత్సాహంగా జరిగాయి. జిల్లా విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, డీవైఎస్ఓ సునీల్‌రెడ్డి క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలు ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ అంశాల్లో పోటీలు నిర్వహించారు. బాలికల ఖోఖోలో మధిర జోన్ ప్రథమ, ఖమ్మం నార్త్ ద్వితీయ, వాలీబాల్‌లో ఖమ్మం నార్త్ ప్రథమ, సత్తుపల్లి ద్వితీయ, సీనియర్ బాలికల కబడ్డీలో ఖమ్మం నార్త్ ప్రథమ, మధిర ద్వితీయ, విజేతలుగా నిలిచాయి. విజేతలకు పాఠశాల క్రీడల కార్యదర్శి నర్సింహామూర్తి బహుమతులు అందజేశారు. సీనియర్, జూనియర్ విభాగాల్లో పాల్గొన్న వారందరికీ భోజన సదుపాయం కల్పించారు.

- ఖమ్మం క్రీడలు, న్యూస్‌టుడే

ఆదెరువు లేదు.. ఆదుకోండి సారూ..!



ఇటీవల మున్నేరు వరదలకు తీవ్రంగా నష్టపోయామని, పరిహారం అందజేయాలని వినతి పత్రం ఇచ్చేందుకు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చిన అర్బన్ మండలం రమణ్ణపేట వృద్ధులు ఎర్రమ్మ, గురవమ్మ, అప్పయ్య.

పక్షవాతంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నామని ఆదుకోవాలని కోరుతూ ప్రజావాణికి తరలి వచ్చిన కొణిజర్ల మండలం చిన్న మునగాలకు చెందిన పాపకంటి వెంకటేశ్వర్లు, నాగమణి



- ఈనాడు, ఖమ్మం

సంక్షేమ రంగానికి పెద్దపీట: మేయర్



మహాలక్ష్మి రాయితీ గ్యాస్ పత్రాలను పంపిణీ చేస్తున్న మేయర్ పునుకొల్లు నీరజ

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: సంక్షేమ రంగానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని నగరపాలక సంస్థ మేయర్ పునుకొల్లు నీరజ అన్నారు. మహాలక్ష్మి పథకం కింద గ్యాస్ రాయితీ పత్రాలను సోమవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. పెరిగిన గ్యాస్ ధరల భారం పేద, మధ్య తరగతి ప్రజలపై పడకుండా ప్రభుత్వం రాయితీని అందిస్తోందన్నారు. ఆరు గ్యారెంటీల అమలు కోసం ప్రత్యేక బడ్జెట్‌ను కేటాయించారని తెలిపారు.



అండర్-14, 17 ఫుట్‌బాల్, అథ్లెటిక్ అండర్-17, రన్నింగ్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన తమ విద్యార్థులను అభినందిస్తున్న సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్ ఆర్‌వీ నాగేంద్రకుమార్ - ఖమ్మం విద్యావిభాగం, న్యూస్‌టుడే

కార్పొరేషన్ కబుర్లు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: నగరపాలక సంస్థలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 24 మంది తమ సమస్యలను సహాయ కమిషనర్ సంపత్‌కుమార్‌కు వినతిపత్రాల ద్వారా తెలియజేశారు.

★ నగరంలోని వేణుగోపాలనగర్ ఎన్ఎస్ కెనాల్ వాక్‌వేను వంటకాలకు, ఇతర కార్యక్రమాలకు ఉపయోగిస్తున్నారని, దీంతో నిర్వహణ అధ్వానంగా తయారైందని పలువురు ఫిర్యాదు చేశారు.

రైతుల అభివృద్ధే లక్ష్యం

కామేపల్లి, న్యూస్‌టుడే: రైతుల అభివృద్ధే లక్ష్యమని పీఏసీఎస్ అధ్యక్షుడు వీరభద్రం యాదవ్ అన్నారు. కామేపల్లి పీఏసీఎస్ మహాజన సభ సోమవారం జరిగింది. రైతులకు ఉత్తమ సేవలందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. అప్పు తీసుకున్న రైతులు సకాలంలో బకాయిలు చెల్లించాలని సూచించారు. అర్హులైన రైతులకు కొత్త రుణాలను మంజూరు చేస్తామని తెలిపారు. సీఈఓ నాగయ్య, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలి

కామేపల్లి, న్యూస్‌టుడే: ఖాతాదారులకు మెరుగైన సేవలందించాలని ఏపీజీవీబీ జనరల్ మేనేజర్ దయాకర్ అన్నారు. కామేపల్లిలో నూతన భవనంలో ఏర్పాటు చేసిన బ్యాంకును రిబ్బన్ కత్తిరించి సోమవారం ప్రారంభించారు. రీజనల్ మేనేజర్ ఉదయ్, సీనియర్ మేనేజర్ సుధీర్ కుమార్, బ్రాంచి మేనేజర్ మనోజ్ పాల్గొన్నారు.

ధ్రువపత్రాల పరిశీలన

ఖమ్మం విద్యావిభాగం: 2008 డీఎస్సీ అభ్యర్థులకు సంబంధించి ఖమ్మం నగరంలోని పాత డీఈఓ కార్యాలయంలో సోమవారం ధ్రువపత్రాల పరిశీలన పూర్తయింది. మైదాన ప్రాంతానికి సంబంధించి మొత్తం 128 మందికి గానూ 67 మంది, ఏజెన్సీకి సంబంధించి 215 మందికి 15 మంది హాజరయ్యారు. డీఈఓ సోమశేఖరశర్మ పరిశీలన కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

జిల్లా సెక్రటేరియట్ పురస్కారం అందజేత



పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు

ఖమ్మం సాంస్కృతికం, న్యూస్‌టుడే: 2023-24 సంవత్సరానికి జిల్లా సెక్రటేరియట్ పురస్కారాన్ని లయన్స్ క్లబ్ ఆఫ్ ఖమ్మం మాజీ అధ్యక్షుడు పాయల నాగేశ్వరరావు అందుకున్నారు. పాల్వంచ పెద్దమ్మ తల్లి దేవాలయం వద్ద సోమవారం జరిగిన కార్యక్రమంలో క్లబ్ గవర్నర్ శివప్రసాద్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు.

ప్రభుత్వ విద్యతో పేద పిల్లలకు మేలు: నాగిరెడ్డి

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: ప్రభుత్వ విద్యతోనే సామాన్య ప్రజానీకానికి చదువులందుతాయని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి అన్నారు. సోమవారం ఖమ్మంలో సంఘం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. నాగిరెడ్డి మాట్లాడుతూ.. ప్రగతిశీల ఉపాధ్యాయులున్నప్పుడే సమాజంలో లౌకిక భావాలు వెల్లివిరుస్తాయన్నారు. సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. ఐలయ్య, కృష్ణారావు, మహేశ్, వీరబాబు, ఉపేందర్, రాధ, ఉపేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

కల్వర్టుకు మరమ్మతులు

ఖమ్మం కార్పొరేషన్: 16వ డివిజన్ సీతారాంపురంలో రెండు రహదారులను కలిపే కాల్వను తవ్వి వదిలేయడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సమస్యను నగరపాలక సంస్థ ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో దానికి సోమవారం మరమ్మతులు చేశారు.

డీఎస్సీలో 37వ ర్యాంకు



వెన్నెల

కూసుమంచి, న్యూస్‌టుడే: డీఎస్సీ ఫలితాల్లో కూసుమంచి మండలం నేలపట్ల గ్రామానికి చెందిన కన్నబోయిన నాగేశ్వరరావు కుమార్తె వెన్నెల ఎస్జీటీలో 37వ ర్యాంకు సాధించింది.

హేమ శైలజకు నివాళి

ఖమ్మం నగరం, న్యూస్‌టుడే: పీఆర్ ఇంజినీరింగ్ శాఖలో విశ్రాంత ఏఈ సుబ్బారావు భార్య హేమశైలజ(64) అనారోగ్యంతో సోమవారం మృతి చెందారు. టీజీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాసరావు, ఎంపీఓల సంఘం జిల్లా అధ్యక్షుడు రవీంద్ర ప్రసాద్ నివాళులర్పించారు.

'1098' నంబర్‌కు విస్తృత ప్రచారం కల్పించాలి

ఖమ్మం కమాన్‌బజార్, న్యూస్‌టుడే: చైల్డ్‌లైన్ హెల్ప్‌లైన్ నెంబర్ 1098కు విస్తృత ప్రచారం కల్పించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం మహిళా శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో రూపొందించిన చిన్నారి పోస్టర్లను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. పిల్లల అక్రమ రవాణా, లైంగిక వేధింపులు, బాల్యవివాహాలు, ఆన్‌లైన్ వేధింపులు, మాదక ద్రవ్యాల నివారణపై అవగాహన కల్పించేందుకు చిన్నారి పోస్టర్‌ను రూపొందించినట్లు వివరించారు. ఎలాంటి సమాచారం తెలిసినా వెంటనే 1098కు తెలియజేయాలని కోరారు. అదనపు కలెక్టర్ పి.శ్రీజ, మధుసూదన్, డీఆర్డీడీఓ సన్యాసయ్య, రాజేశ్వరి, కెరాంగోపాల్‌రెడ్డి, విష్ణువందన పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు

గుర్తుతెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

కూసుమంచి, న్యూస్‌టుడే: మండలంలోని పాలేరు సమీపంలో సోమవారం గుర్తుతెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. గైగొళ్లపల్లికి చెందిన బానోత్ శ్రీను (45) అనే వ్యక్తి సూర్యాపేట రహదారి వెంట నడుస్తూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొంది. ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతిచెందాడు. పోలీసులకు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.



నాయకన్‌గూడెం వరద బాధితులకు వంటకాలు అందజేస్తున్న లక్ష్మీతులసీ ఆటోమొబైల్ నిర్వాహకులు కందుల మాధవరావు, తహసీల్దార్ సురేశ్ తదితరులు - కూసుమంచి, న్యూస్‌టుడే

రేవంత్‌తో నడుద్దాం.. వర్గీకరణ సాధిద్దాం: పిడమర్తి రవి

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: 'కృష్ణమాదిగ, భాజపా వద్దు సీఎం రేవంత్‌తో నడుద్దాం.. ఎస్సీ వర్గీకరణ సాధిద్దామని' మాదిగ ఐకాస వ్యవస్థాపక అధ్యక్షుడు డా.పిడమర్తి రవి పిలుపునిచ్చారు. తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న మాదిగల మేలుకొలుపు యాత్ర సోమవారం ఖమ్మం చేరుకుంది. నగరంలోని రేవతి సెంటర్లో కార్నర్ మీటింగ్ నిర్వహించారు. రవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర జనాభా దామాషా ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని, జిల్లాను యూనిట్‌గా తీసుకొని జిల్లాల వారీగా వర్గీకరణ చేసి మాదిగ జాతికి న్యాయం చేయాలన్నారు. అలా చేయడం సీఎం రేవంత్‌రెడ్డితోనే సాధ్యమవుతుందన్నారు. తెలంగాణ మాదిగ రాజకీయ వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వక్కలగడ్డ సోమచంద్రశేఖర్ మాట్లాడుతూ... ఖమ్మం జిల్లాలో 75 శాతం ఉన్న మాదిగలకు కాంగ్రెస్ పార్టీలో అన్యాయం జరుగుతుందన్నారు. నామినేటెడ్ పదవుల్లో మాదిగలకు జనాభా దమాషా ప్రకారం పదవులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కొండమీది గోవిందరావు, మట్టె గురుమూర్తి, మైసా ఉపేందర్, గజ్జెల్లి మల్లికార్జున్, జోగారావు, నంద్ర ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న మాదిగ ఐకాస వ్యవస్థాపక అధ్యక్షుడు పిడమర్తి రవి, సోమచంద్రశేఖర్



సుర్దేపల్లిలో బాధితులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఖమ్మం గోదాముల మేనేజర్ సుందర్‌లాల్, నాగరాజు రాష్ట్ర గిడ్డంగులు ఉద్యోగులు

- నేలకొండపల్లి, న్యూస్‌టుడే

వరద బాధితులకు అండగా నిలిచాం...



సమావేశంలో మైత్రాసన సేవా సంఘం బాధ్యులు, ఫాస్టర్లు

ఖమ్మం గ్రామీణం, న్యూస్‌టుడే: మున్నేరు వరదల్లో ముంపునకు గురైన తాము బాధితులకు అండగా నిలబడ్డామని ఖమ్మం మైత్రాసన సాంఘిక సేవా సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫాస్టర్ సురేశ్ దామల పేర్కొన్నారు. సోమవారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కరుణగిరి బిషప్ హౌస్, చర్చితో పాటుగా అనేక సంస్థలు ముంపునకు గురయ్యాయని తెలిఆరు. అయినా వరద బాధితులకు సాయం అందిస్తున్నామని తెలిపారు. బిషప్ సగిలి ప్రకాశ్ ఆదేశాల మేరకు వరద ప్రాంతాల్లో దాదాపు 5 వేల మందికి నిత్యావసరాలు, దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేసినట్లు వివరించారు. ఫాదర్లు పీఏస్ అమల్‌రాజ్, సెల్విన్, శౌరి, సుధాకర్, అమల్, జయరాజు, చార్లెస్ పాల్గొన్నారు.

రైతులకు నష్ట పరిహారం ఇవ్వాలి: తెదేపా

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: జిల్లాలో వచ్చిన ఆకస్మిక వరదలకు పంటలు నష్టపోయిన రైతులకు వెంటనే పరిహారం చెల్లించాలని తెలుగుదేశం పార్టీ నాయకులు డిమాండ్ చేశారు. కేతినేని హరీష్‌చంద్ర, కొండబాల కరుణాకర్, మందపల్లి కోటి, అశ్వనీకుమార్, బోడేపూడి రవి పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిని కఠినంగా శిక్షించాలి: ఏఐఎస్ఎఫ్

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: వైరా మండలం పాలడుగు ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించడం అమానుషమని, కీచక ఉపాధ్యాయుడిని తక్షణమే కఠినంగా శిక్షించాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) జాతీయ కార్యవర్గ సభ్యుడు ఇటికాల రామకృష్ణ డిమాండ్ చేశారు. నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఎదుట ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం దిష్టిబొమ్మ దహనం చేశారు. కొందరు వృత్తికే కళంకం తెచ్చేలా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శులు శివనాయక్, వంశీ, నాయకులు మనోజ్, రాకేశ్, మౌనిక, ప్రవళిక, చైతన్య, రమ్య, దివ్య, అను, సంధ్య తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మ దహనం చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు



నగరంలో ప్రదర్శన నిర్వహిస్తున్న నాయకులు, విద్యార్థులు

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ర్యాలీ

ఖమ్మం మామిళ్లగూడెం, న్యూస్‌టుడే: ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం(పీడీఎస్‌యూ) 50 ఏళ్లు పూర్తయిన నేపథ్యంలో అక్టోబరు 21న ఖమ్మంలో జరిగే అర్ధ శతాబ్ది ఉత్సవ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ మహిళా కళాశాల నుంచి ప్రారంభమైన ప్రదర్శన అర్బన్ తహసీల్దారు కార్యాలయం వరకు సాగింది. జిల్లా కార్యదర్శి జి.మస్తాన్ మాట్లాడుతూ.. విద్యార్థి ఉద్యమ చరిత్రలో తెలుగు నేలపై చెరగని ముద్ర వేసిన పీడీఎస్‌యూ 50 ఏళ్ల ప్రస్థానం సభ నిర్వహించుకోవడం చారిత్రాత్మకమని తెలిపారు. అరుణోదయ నాయకురాలు నిర్మల, పీడీఎస్‌యూ నాయకులు భాను, రామకృష్ణ, అఖిల, శ్వేత, అశ్విని, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై చిత్రలేఖన పోటీలు

ఖమ్మం కార్పొరేషన్, న్యూస్‌టుడే: 'స్వచ్ఛతా హీ సేవ' కార్యక్రమంలో భాగంగా నగరంలోని మైనార్టీ గురుకుల సంక్షేమ పాఠశాల, కళాశాలల్లో సోమవారం నిర్వహించిన పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ చూపారు. స్వచ్ఛతపై వారికున్న అవగాహన, దానివల్ల ఒనగూరే ప్రయోజనాలను తమ కుంచె ద్వారా వారు చూపిన విధానం వారి సృజనాత్మకతకు అద్దం పట్టింది. ఈ సందర్భంగా గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

మలి వయసులో మిద్దె తోట సాగు

ఖానాపురం హవేలి, న్యూస్‌టుడే: మధ్య వయసులోనే తమ పనులు తాము చేసుకోవడానికి బద్ధకించేవారు ఉన్న ఈ రోజుల్లో ఏడు పదుల వయసులో ఆమె చురుగ్గా ఉంటున్నారు. తనకు ఇష్టమైన మొక్కల పెంపకం చేపట్టి మిద్దె పంటల సాగు కొనసాగిస్తూ ఔరా అనిపించుకుంటున్నారు. నేడు వృద్ధుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

ఖమ్మం నగరానికి చెందిన ప్రముఖ వైద్యురాలు డా.వాసిరెడ్డి నిర్మల(75). సీటీజీ గ్రూపు సాయంతో ఖమ్మం స్టేషన్ రోడ్డులోని తన ఇంటిపై రెండేళ్లుగా వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పండ్ల మొక్కలు సాగు చేస్తున్నారు. రోజు ఆస్పత్రిలో రోగులను చూస్తూనే, మొక్కలను ప్రేమగా చూసుకుంటున్నారు. రోజు ఉదయం రెండు గంటలు మిద్దెపై మొక్కలకు నీళ్లు పెట్టడం, వాటి యాజమాన్య చర్యలు తీసుకోవడంతో దినచర్య ప్రారంభమవుతుంది. మొక్కలతో గడిపిన రోజు ఎంతో ఉత్సాహంగా.. ఆనందంగా ఉంటుందని చెబుతున్నారు. మిద్దెపై పండించిన కూరగాయలు, ఆకుకూరలు ఎంతో రుచికరంగా ఉంటాయని చెబుతున్నారు. మలి వయసులో మిద్దె పంటలు సాగు చేస్తూ.. ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు ఈ డాక్టరమ్మ.



తన మిద్దెతోటలో సాగు చేసిన కూరగాయలను చూపుతున్న డా.వాసిరెడ్డి నిర్మల